



	కనిష్టం	గరిష్టం
ఖమ్మం	26	28
భద్రాద్రి	18	35



భద్రాచలం వద్ద గోదావరి నదీ ప్రవాహం

శాంతించిన గోదావరి

- తగ్గుముఖం పట్టిన వరద ప్రవాహం
- భద్రాద్రి వద్ద 51.6 అడుగులకు చేరిన నీటిమట్టం
- పలుచోట్ల నిలిచిన అంతర్ రాష్ట్ర రాకపోకలు

వివరాలు : 6లో



ఖమ్మం బస్తీ దవాఖానాలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

మెరుగైన వైద్యం అందాలి

- వైద్యులు సమయపాలన పాటించాలి
- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
- ఖమ్మం బస్తీ దవాఖానాల్లో తనిఖీలు

వివరాలు : 7లో



విద్యుత్ వ్యవస్థను పరిశీలిస్తున్న చైనా నిపుణుడు

30న 'సీతారామ' ట్రయల్ రన్

- చైనా నుంచి వచ్చిన నిపుణుల బృందం
- వైరాకు గోదావరి జలాలు విడుదలకు ఆగస్టు 9న ట్రయల్‌రన్
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

వివరాలు : 6లో

నిరాశే మిగిలింది..

కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మొండిచేయి



- ఊసేలేని బయ్యారం ఉక్కు పరిశ్రమ
- గోదావరి జల కాలుష్య నివారణకు నిధులేవీ?
- కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ముచ్చటే లేదు..
- రైల్వే ప్రాజెక్టులకు ఒక్కపైసా కేటాయించలేదు..
- జాతీయ రహదారులకు మాత్రం నిధులు
- ఆయిల్‌పామ్ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర... రైతులకు ఊరట
- బడ్జెట్ కేటాయింపులపై భిన్న వర్గాల అసంతృప్తి

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్... ఉమ్మడి జిల్లాకు 'కొంచెం తీపి.. కొంచెం చేదు..' అనే తరహాలో ఉంది. కొన్ని పథకాలకు భరోసా ఇవ్వగా, జిల్లాలో కీలకమైన సమస్యలకు మాత్రం మొండిచేయి చూపింది. ఏపీ పునర్విభజన చట్టంలో రూపొందించిన బయ్యారం ఉక్కు పరిశ్రమకు మళ్లీ నిరాశే మిగిలింది. ఈ సారి బడ్జెట్‌లో జిల్లాకు మేలు చేకూరేలా బయ్యారం ఉక్కు పరిశ్రమ వంటి హామీలకు మోక్షం లభిస్తుందని అంతా భావించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధాన పార్టీలు బయ్యారం ఉక్కు పరిశ్రమనే ఎజెండాగా తీసుకున్నారు. విభజన చట్టంలో ఏపీకి ఇచ్చిన హామీలు ఈ బడ్జెట్‌లో నెరవేర్చినా... తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన పలు హామీల్లో కీలకమైన బయ్యారం ఉక్కు పరిశ్రమ విషయంలో ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు.

ఖమ్మం, జూలై 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాల జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ప్రకటించింది. ఏపీలోని రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇస్తామని ప్రకటించింది. అయితే ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు వెనుకబడిన జిల్లాల కోటాలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు నిధులు వచ్చేవి. ప్రస్తుతం విడిపోయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూర్తిగా గిరిజన ప్రాంతంగా ఉంది. మావోయిస్టు ప్రభావిత జిల్లా. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం లేదా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వెనుకబడిన ప్రాంతం కింద నిధులు కేటాయించాల్సి ఉంది. కానీ తెలంగాణలో ఏ జిల్లా పేరును ప్రస్తావించ లేదు.

గోదావరి జలకాలుష్యం... జలమార్గం...

మూడు దశాబ్దాల డిమాండ్‌గా ఉన్న గోదావరి జలకాలుష్య, గోదావరి జలమార్గ ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన చేయలేదు. దక్షిణాదిలో కీలకమైన గోదావరి నది జల కాలుష్యానికి గురవుతోంది. ఈ నది పరీవాహక ప్రాంతంలోని పరిశ్రమల నుంచి వ్యర్థాలు గోదావరిలో కలుస్తున్నాయి. దీంతో గోదావరి జలకాలుష్య నివారణకు గతంలో ప్రతిపాదనలు జరిగాయి. కానీ నిధుల కేటాయింపు లేకపోవడంతో ఈ పథకం నిలిచిపోయింది. ఈ సారి బడ్జెట్‌లో కూడా గోదావరి జలకాలుష్య పథకానికి నిధులు కేటాయించలేదు. అలాగే భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని చర్ల నుండి ఏపీలోని రాజమండ్రి వరకు ఏలూరు బకింగ్‌హామ్ కాలువను కలుపుతూ జలరవాణ ప్రాజెక్టుకు కూడా ప్రతిపాదనలు జరిగాయి. కేంద్ర ఉపరితల రవాణశాఖ ఈ జలమార్గాన్ని రూపొందించింది. కానీ ఈసారి కూడా జలమార్గానికి కేంద్రం నిధులు కేటాయించలేదు.

కొత్తగూడెం ఎయిర్‌పోర్టు కలేనా?

తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటన చేస్తుందని ఆశించినా ఇందుకు సంబంధించి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. హైదరాబాద్ తర్వాత తెలంగాణలో ఎక్కడా ఎయిర్‌పోర్టులు లేవు. భద్రాచల పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ఏర్పాటుచేయాలని ఎంపీ రఘురాంరెడ్డి విజ్ఞప్తి చేశారు. అయినా బడ్జెట్‌లో హామీ లభించలేదు.

నేషనల్ హైవేకు నిధులు

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జాతీయ రహదారుల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.2.78లక్షల కోట్లు నిధులు కేటాయించారు. దీంతో జిల్లాకు సంబంధించి ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-కోదాడ, నిర్మాణం కానున్న ఖమ్మం-కురవి, నాగపూర్-అమరావతి జాతీయ రహదారులకు నిధుల కేటాయింపులు జరగబోతున్నాయి. దీంతో పనులు చురుగ్గా జరగనున్నాయి. అయితే రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన చేయలేదు. దీంతో కొవ్వూరు- కొత్తగూడెం, సత్తుపల్లి-కొండపల్లి, రామగుండం- భద్రాచలం, భద్రాచలం-పాండురంగా పురం, భద్రాచలం- కిరండోల్‌కు ఈసారి కూడా నిధుల కేటాయింపు లేనట్లే అయింది.

రైతులకు భరోసా

కేంద్ర బడ్జెట్ రైతులకు భరోసా కల్పించింది. పీఎం కిసాన్ యోజన పథకం యథావిధిగా అమలు చేయడంతోపాటు నూనెగింజలు పండించే రైతులకు ప్రోత్సాహకాలు రాబోతున్నాయి. ఆయిల్‌పామ్‌తో పాటు పొద్దుతిరుగుడు, నువ్వులు, వేరుశనగ, తదితర నూనెగింజలు ఉత్పత్తి చేసే రైతులకు కనీసమద్దతు ధరతో పాటు రైతులకు అవసరమైన బీమా పథకాలు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించింది.

దీంతో ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు కేంద్రం నిర్ణయం వల్ల కొంత ఊరట లభించనుంది. అలాగే బంగారం, సెల్‌ఫోన్ వంటి వస్తువులపై 15శాతం పన్ను మినహాయింపులు ఇవ్వడం ద్వారా వీటి ధరలు తగ్గి విక్రయాలు పెరగనున్నాయి. పీఎం ఆవాస్ యోజన కింద ఏటా కోటి ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో పదిలక్షల కోట్ల బడ్జెట్ కేటాయించింది. దీంతో జిల్లాలో ఇళ్లులేని పేదలకు ఈ పథకం కొంత లబ్ధి చేకూరనుంది. మహిళలకు, యువతకు నైపుణ్య శిక్షణ పథకాలు ప్రవేశపెట్టడం ద్వారా కొంత ఊరట లభించనుంది. దేశంలో ఉన్నత చదువులు చదివే వారికి రూ.10లక్షల రుణాన్ని ఈ-వోచర్ ద్వారా రుణ సదుపాయాన్ని 3 శాతం వడ్డీతో కల్పించబోతుంది. ఈ పథకం ద్వారా జిల్లాలో ఇంజనీరింగ్, పీజీ, మెడిసిన్ చదివేవారు తక్కువ వడ్డీతో రుణం పొందే అవకాశం ఉంది.



కేంద్ర బడ్జెట్ పూర్తి నిరాశ కలిగించింది..


కేంద్ర బడ్జెట్ తెలంగాణకు పూర్తిగా నిరాశ కలిగించింది. ఏపీ పునర్విభజన చట్టంలో ప్రకటించిన బయ్యారం ఉక్కు పరిశ్రమ, వరంగల్‌కోచ్ ఫ్యాక్టరీ వంటి ప్రాజెక్టుల గురించి ఎక్కడా హామీ ఇవ్వలేదు. ఏపీకి సంబంధించిన అమరావతికి నిధుల కేటాయింపు, పోలవరానికి నిధుల హామి ఇచ్చారు. తెలంగాణలోకూడా వెనుకబడిన జిల్లాలున్నా నిధులు లేవు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుచేయాలని సూచించా. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో రైల్వేమార్గాలు, ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కేంద్రం నుంచి హామీ ఇవ్వలేదు. అయినా తెలంగాణ ఎంపీల బృందం రాష్ట్ర సమస్యలపైనా ప్రధానిని, కేంద్రమంత్రులను ప్రత్యేకంగా కలిసి విన్నవిస్తాం.

- ఆర్.రఘురాంరెడ్డి, ఖమ్మం ఎంపీ

తెలంగాణపై కేంద్ర ప్రభుత్వ వివక్ష

తెలంగాణకు బడ్జెట్‌లో నయా పైసా నిధులు కేటాయించ లేదు. తెలంగాణ ప్రజలు ఎనిమిది ఎంపీ స్థానాలు బీజేపీకి కట్టబెడితే.. రెండు కేంద్ర మంత్రి పదవులు తెచ్చుకున్న బీజేపీ నేతలు సైతం నోరు మెదపలేకపోయారు. మూసీ ప్రాజెక్టుకు నిధులు ఇవ్వని కేంద్రం... పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించింది. పదేళ్లుగా పునర్విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదు. బీఆర్ఎస్ ప్రోద్బలంతోనే కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు.

- పోరిక బలరామ్ నాయక్, మహబూబాబాద్ ఎంపీ



నీవు లేక నేనుండలేను..

- ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువతితో ప్రేమ
- అనారోగ్యంతో ఆమె మృతి చెందడంతో మనోవేదన
- ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య



చింతకాని, జులై 23: ప్రియురాలి మరణాన్ని తట్టుకోలేక మనోవేదనతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం వందనం గ్రామంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి సతీష్ (24)మంగళవారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో గుంటూరుకు చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారడంతో ఇద్దరూ గత రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఆ యువతి క్యాన్సర్‌తో బాధపడుతూ రెండు వారాల క్రితం మృతి చెందింది. ప్రియురాలి మృతితో సతీష్ తీవ్ర విషాదంలోకి కూరుకుపోయాడు. ఆశా కార్యకర్తగా చేస్తున్న తన తల్లి మంగళవారం విధులకు వెళ్లగా, తండ్రి పొలం పనులకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సతీష్ బెడ్రూంలో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విధులను ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లికి ఉరికి వేళాడుతున్న కుమారుడు కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. సంఘటనా స్థలాన్ని చింతకాని ఎస్ఐ నాగుల్‌మీరా పరిశీలించారు. సతీష్ బీ ఫార్మసీ పూర్తి చేశాడు. మృతుడి తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేఎంసీలో బదిలీలు

- టౌన్ ప్లానింగ్‌లో పలువురికి స్థానచలనం

ఖమ్మం కార్పొరేషన్, జూలై 23: సాధారణ బదిలీల్లో భాగంగా ఖమ్మం నగరపాలక సంస్థ (కేఎంసీ) కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో బదిలీలు జరిగాయి. అయితే డిప్యూటేషన్‌పై ప్రస్తుతం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న వారిని బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారిగా పనిచేస్తూ ఖమ్మం నగరపాలక సంస్థలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న సాయిరాంను మహబూబాబాద్ మునిసిపాలిటీకి బదిలీ చేశారు. రామగుండం మునిసిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై ఖమ్మంలో విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్‌కు వరంగల్ బదిలీ అయింది. వరంగల్ కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ ఖమ్మంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న తేజస్వినికి ఖమ్మం కార్పొరేషన్‌లోనే రెగ్యులర్ పోస్టు ఇస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అయితే బదిలీ అయిన వారి స్థానంలో ఎవరినీ నియమించలేదు.

పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేక..

- పురుగుల మందు తాగి 5వ తరగతి విద్యార్థి ఆత్మహత్య
- గుండాల మండలం రోళ్లగడ్డలో ఘటన



గుండాల, జూలై 23: బడికి పంపిస్తే చచ్చిపోతా అని బెదిరించడంతో.. కన్న కొడుకు కళ్ల ముందు ఉంటే చాలను కున్న ఆ తల్లిదండ్రులకు కన్నీరే మిగిలింది. ఎలాగైనా బుజ్జగించి మళ్లీ బడికి పంపిస్తారనుకొని పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేక పదేళ్ల బాలుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

గుండాల మండలంలోని రోళ్లగడ్డ తండ గ్రామానికి చెందిన అజ్మీర ఈరు-అరుణ దంపతుల కుమారుడు సుధీర్‌బాబు(10) స్థానిక ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి పూర్తి చేసి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో సీటు సాధించాడు. ఇటీవల బాలుడిని పాఠశాలలో చేర్పించినా తరచూ ఇంటికి వెళ్లేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇతరుల సెల్‌ఫోన్ నుంచి తల్లిదండ్రులకు ఫోన్ చేసి తనను ఇంటికి తీసుకు వెళ్లకపోతే పాఠశాల భవనం పైనుంచి దూకి చనిపోతానని బెదిరించడంతో తల్లిదండ్రులు ఆ రోజు సాయంత్రమే పాఠశాలకు వెళ్లి సుధీర్‌బాబును ఇంటికి తీసుకువచ్చారు. ఇంటికి వచ్చిన తరువాత మళ్లీ పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించారు. అయినా వినకపోవడంతో చేసేదేమీ లేక ఇంటివద్దనే ఉండమన్నారు. అయితే ఎప్పటికైనా తనను పాఠశాలకు పంపిస్తారనే భయంతో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధీర్‌బాబు పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గుండాల అనుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కొత్తగూడెం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. గుండాల పీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. గుండాల ఎస్ఐ రాజమౌళి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రుణమాఫీలో ఎన్నో రూల్సు..

- బంగారం రుణాల మాఫీపై ఆదేశాలు లేవంటున్న అధికారులు
- రూ.రెండు లక్షలపైన ఉన్న రుణాలను చెల్లించాల్సిందే...
- ప్రత్యేక యాప్ ద్వారా సమాచారం అందిస్తున్న వ్యవసాయ శాఖ
- రైతుల అనుమానాలు నివృత్తి చేస్తున్న అధికారులు
- మాఫీ పొందని రైతుల్లో ఆందోళన

సత్తుపల్లి, జులై 23: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంట రుణమాఫీ 2024 పథకానికి సంబంధించిన ఉత్తర్వుల్లో పేర్కొన్న కొన్ని మార్గదర్శకాలపై రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులపై ఉన్న రుణభారాన్ని తగ్గించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల లోపు రైతు రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించి జీవో ఆర్టీ నెం: 567 జారీ చేసింది. ఇందులో రుణమాఫీకి సంబంధించి మార్గదర్శకాలు పొందుపర్చింది. ఈ క్రమంలో ఇప్పటికే రూ.లక్షలోపు రుణాలను రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయం విదితమే. ఖమ్మం జిల్లాలో 57,857 మంది రైతులకు సంబంధించి రూ.లక్ష రుణం మాఫీ చేస్తూ వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. మరో రెండు విడతల్లో రుణ మాఫీ అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

స్పష్టత లేని బంగారం రుణాల మాఫీ

రైతులు వ్యవసాయం కోసం బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. బంగారం తనఖా పెట్టి తీసుకున్న వ్యవసాయ రుణాలు కూడా మాఫీ చేస్తామని గతంలో ప్రకటించారు. కాని ప్రభుత్వ మార్గదర్శకాల్లో మాత్రం బంగారం తాకట్టు రుణాల మాఫికి సంబంధించి ఉత్వర్వులు ఏమి లేవని అధికారులు చెబుతున్నారు.

రూ.2లక్షల పైన రుణాలు చెల్లించాల్సిందే....

రూ.రెండు లక్షలు దాటి అధికంగా రుణం ఉన్న రైతులు రూ.రెండు లక్షల పైన ఉన్న అప్పును బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించిన తరువాతనే రూ.రెండు లక్షల రుణ మాఫీ వర్తిస్తుందని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. సాధారణంగా ఒక కుటుంబంలో భార్య, భర్తలకు వేర్వేరుగా వ్యవసాయ రుణాలు తీసుకొని ఉంటారు. ఉదాహరణకు భార్య, భర్తలకు ఒక బ్యాంకులో గాని, వేర్వేరు బ్యాంకుల్లో గాని రూ.అయిదు లక్షలు పంట రుణం ఉంటే రూ.రెండు లక్షలు మాఫీ రుణం కంటే అధికంగా ఉన్న రూ.మూడు లక్షలు చెల్లించిన తరువాత రుణ మాఫీ వర్తిస్తుంది. అధికంగా ఉన్న రుణం ఎప్పటి లోగా రైతులు చెల్లించాలనేది అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.



ఆధార్ లింక్ లేక...

రుణం పొందిన రైతులు బ్యాంకు రుణ ఖాతాలకు ఆధార్ లింక్ చేయకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరో పక్క ఆహార భద్రత కార్డు లేని వారి కుటుంబాల నిర్ధారణ కూడా జరగాల్సి ఉంది. ఆహార భద్రత కార్డు లేని వారికి సంబంధించి వారి నుంచి వ్యవసాయ శాఖ అధికారులు దరఖాస్తులు తీసుకుంటున్నారు. వీరికి సంబంధించి సమాచారం ప్రత్యేక మాడ్యూల్ వచ్చిన తరువాత అందులో నమోదు చేయనున్నారు. ఆహార భద్రత కార్డు లేని వారికి పాస్‌పుస్తకం ఆధారంగా రుణ మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఉత్తర్వులు రాలేదు. దీనితో పాటు ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ తేదీల్లో రుణం పొందిన వారు కాలక్రమంలో మొత్తం రుణం బ్యాంకులకు తిరిగి చెల్లించినా తమకు రుణ మాఫీ వర్తించటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లో రుణం పొంది అయిదారు నెలల క్రితం తమ వ్యవసాయ భూములను (మిగతా 6వ పేజీలో)

స్వితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

▸ దివ్యాంగుల విజయాలు కనబడని సబర్వాల్ దివ్యాంగురాలే? ▸ టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సతీష్



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తంచేస్తున్న దివ్యాంగులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 23: దివ్యాంగుల విజయాలు కనబడని స్మిత సబర్వాల్ దివ్యాంగురాలేనని టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వి-జేఏసీ చైర్మన్ గుండపనేని సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కళ్ళకు గంతలు కట్టుకొని తెలంగాణ విభిన్న ప్రతిభావంతులు (టీవీపీఎస్) సంఘం సభ్యులు నిరసనను తెలిపారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి వికలాంగులను కించపరిచే విధంగా ట్విట్టర్లో పోస్ట్ పెట్టిన ఐఏఎస్ స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని , వికలాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సర్వీసులో వికలాంగులకు ఎందుకు రిజర్వేషన్ ఇవ్వాలని ట్విట్టర్ వేదికగా ప్రశ్నించడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వ సర్వీస్ ఉద్యోగ నియామకాలలో వికాలాంగుల రిజర్వేషన్ అమలు చేయాలని కోర్టు తీర్పులు ఉన్నాయనే విషయం తెలియకుండా ఐఏఎస్ ఎలా అయ్యారని విమర్శించారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని, వికలాంగుల మనో భావాలు దెబ్బతినేలా ప్రవర్తించిన స్మిత సబర్వాల్ వెంటనే వికలాంగులకు క్షమాపణ చెప్పాలన్నారు. దివ్యాంగులుగా ఉన్నప్పటికి అనేక మంది తమ ప్రతిభతో ఐఏఎస్ ఆఫీసర్లుగా, సుప్రీంకోర్టు జడ్జీలుగా, గొప్ప శాస్త్ర వేత్తలుగా సేవలను అందించిన వారి విజయాలు చూడలేని స్మిత సబర్వాల్ పెద్ద వికాలాంగురాలని అందుకే వారి ప్రతిభ ఆమె గుర్తించలేని అహంకార పూరితంగా ట్విట్టర్‌లో పోస్టుకు పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తున్నా ఇంత మట్టుకు దివ్యాంగులకు క్షమాపణ చెప్పకపోవడం ఆమె అహంకారానికి అద్దం పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆమెపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్‌మక్కట్, మాదిగ జేఏసీ అధ్యక్షులు జోగారావు, బీజెపి జిల్లా కన్వీనర్ కాటి నాగేశ్వరరావు, సంఘ ఉపాధ్యక్షులు ఖాదర్ బాబా, ప్రధాన కార్యదర్శి మేడి ప్రవీణ్‌కుమార్, మహిళా సభ్యురాలు శైలజ, కళాబాబురెడ్డి, సురేష్, సాయిబాబా, శ్రీను, గట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్టు సిబ్బందికి రూ.30లక్షల ప్రమాద బీమా

▸ డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎండీ బలరాం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న సుమారు 25వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు రూ. 30లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తింపచేస్తున్నామని, హెచ్‌డీఎఫ్‌సీ శాలరీ అకౌంట్ కలిగిన ప్రతి కాంట్రాక్టు ఉద్యోగికి అమలు అవుతుందని సింగరేణి సీఎండీ బలరాం నాయక్ అన్నారు. మంగళవారం సాయంత్రం సింగరేణి భవన్‌లో కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమంపై సంస్థ డైరెక్టర్లు, ఏరియా జీఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల జీఎంలు కాంట్రాక్టర్ల ద్వారా కాంట్రాక్టు ప్రమాద బీమాపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సింగరేణి ఉద్యోగుల కోసం ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల ద్వారా కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా రూ.50లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయాన్ని కాంట్రాక్టు ఉద్యోగులకు వర్తింపచేస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబసభ్యులు సామాజిక ఆర్థిక భద్రత చర్యల్లో భాగంగా సంక్షేమ పతకాలు చేపడతున్నామన్నారు. సింగరేణి ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందిస్తున్నామని, కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబసభ్యులకు ఆరోగ్య సేవలు అందించేందు ఎంప్లాయిస్ స్టేట ఇన్సురెన్స్ (ఈఎస్ఐ) ఆసుపత్రుల ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. కొత్తగూడెం, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్‌టీపీసీ)లో వైద్యసేవలు అందిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు, పీఎఫ్,సీఎంపీఎఫ్, చెల్లింపులు సకాలంలో జరిగేందుకు వెబ్ అప్లికేషన్ ద్వారా మస్టర్లు నమోదుప్రక్రియ చేపడుతున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్తగూడెం డైరెక్టర్ డి. సత్యనారాయణ (ఈఅండ్‌ఎం), ఎన్‌వీకే. శ్రీనివాస్ (ఆపరేషన్ అండ్ పర్సరన్, కార్పోరేట్ జీఎం జీ. వెంకటేశ్వర రెడ్డి, సింగరేణి భవన్ నుంచి జీఎం కోఆర్డినేషన్ జి. దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామాలయంపై వరదల ప్రభావం

▸ తగ్గిన భక్తులు, ఆదాయం



వరదల నేపథ్యంలో రామాలయంలో ఇలా

భద్రాచలం, జూలై 23: గత వారం రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలోఆ ప్రభావం భద్రాచలం రామాలయంపై పరోక్షంగా పడింది. వర్షాలు అధికంగా కురుస్తుండటంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గతంలో కంటే తగ్గింది. సాధారణంగా ఎనిమిది వేల నుంచి 12 వేల మంది భక్తులు సాధారణ రోజుల్లో దర్శించుకుంటుండగా శని, ఆదివారాల్లో 15 నుంచి 20 వేల వరకు భక్తులు రామయ్య దర్శనం చేసుకుంటున్నారు. అయితే గత నాలుగు రోజులుగా ఆలయాన్ని దర్శించిన భక్తుల సంఖ్య నాలుగువేలు కూడా దాటకపోవడం గమనించదగ్గ విషయం. అలాగే భద్రాద్రి రామయ్య ఆదాయం మంగళవారం అత్యంత కనిష్ఠంగా కేవలం రూ.1,58,914 వచ్చింది. 20వ తేదీ సైతం రూ.2.16 లక్షల వరకు ఆదాయం రావడం జరిగింది. వాస్తవానికి ఇటీవల కాలంలో భద్రాద్రి రామయ్యకు రోజువారీ ఆదాయం బాగానే వస్తున్నా వరదల నేపథ్యంలో భక్తులు వచ్చేందుకు పరిస్థితులు అనుకూలించకపోవడం మరోవైపు భద్రాద్రిలో గోదావరి ఉగ్రరూపం దాల్చిందని కథనాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో రావడంతో భక్తులు రాలేదు.

ప్రభుత్వ న్యాయవాదిగా రవీందర్



ఖమ్మం లీగల్ జూలై 23: ఖమ్మం జిల్లాకోర్టుకు ప్రభుత్వ న్యాయవాదిగా ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది అయితం రవీందర్ ను నియమిస్తూ మంగళవారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీచేశారు. రవీందర్ ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి 1990లో విజయవాడ సిద్ధార్థ లా కాలేజీలో న్యాయశాస్త్రంలో పట్టాపొందారు. అదే సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ లో న్యాయవాదిగా నమోదుచేసుకొని ఖమ్మంలో సీనియర్ న్యాయవాదులు మురళీధరరావు, సుధాకర్‌రావుల వద్ద జూనియర్ న్యాయవాదిగా పనిచేశారు. ప్రభుత్వ న్యాయవాదిగా అయితం రవీందర్ నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

సీహెచ్‌పీ నాణ్యత, అవినీతిపై విచారణ జరపాలి

సత్తుపల్లిరూరల్, జులై23: మండలంలోని కిష్టారంలో సింగరేణి యాజమాన్యం నిర్మించిన సీహెచ్‌పీ నాణ్యత, అవినీతిపై విచారణ జరపాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జేవీఆర్ ఓసీలోని కోల్ హ్యాండ్లింగ్ పాయింట్ (సీహెచ్‌పీ)ను సందర్శించి గేట్‌మీటింగ్ నిర్వహించారు. రూ.400కోట్ల బడ్జెట్‌తో కోల్ ట్రాన్స్‌పోర్టేషన్ కోసం నిర్మించిన కోల్ బంకర్స్‌లో రెండేళ్లకే పగుళ్లు ఏర్పడటంలోనే అవినీతి కనిపిస్తుందని, నాణ్యత విషయంలో విచారణ జరిపించాలని కోరారు. అదేవిధంగా అవినీతికి పాల్పడిన వారితో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల రక్షణే ధ్యేయమని యాజమాన్యం చెబుతున్నప్పటికీ ఇక్కడ అవేవీ కానరావడం లేదని వాపోయారు. నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు ప్రభాకర్ భూమి సర్వే

చింతకాని, జులై 23: ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న పొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్ వ్యవసాయ భూమిని మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. రైతు బోజడ్ల ప్రభాకర్, అతని తండ్రి పెద్దవీరయ్యలకు చెందిన భూమికి సంబంధించి సర్వేయర్లు వాస్తవిక హద్దుల ప్రకారం సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించారు. సర్వేకు సంబంధించిన సమగ్ర రిపోర్టును బుధవారం విడుదల చేస్తామని తహసీల్దార్ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ రాంప్రసాద్, జేఈ సురేష్, ఎస్ఐ నాగుల్‌మీరా, డీఐ లూర్థు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ వలంటీర్లకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సన్మానం



వలంటీర్లను సత్కరిస్తున్న ఎండీ సజ్జనార్

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 23: ఆర్టీసీ హెల్త్ వలంటీర్లను మంగళవారం హైదరాబాద్‌లోని కళాభవన్‌లో సంస్థ ఎండీ సజ్జనార్ సన్మానించారని ఖమ్మం రీజనల్ మేనేజర్ ఏ సరిరాం తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు డిపోలకు చెందిన హెల్త్‌వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని వారిని ఎండి సన్మానించారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితులను సమీక్షించి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా అవసరమైన వైద్యసలహాలు అందించటం, మెరుగైన వైద్యసేవల కోసం ఆర్టీసీ డిస్పెన్సరీలకు వెళ్లేలా సూచనలను వీరు అందించారు.

మహిళాశక్తిలో జిల్లాను ఆదర్శవంతంగా నిలపాలి

▸ భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కొత్తగూడెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళాశక్తి ఆదర్శవంతంగా జిల్లాను నిలపాలని, మహిళలకు జీవనోపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలనే సదుద్దేశంతో ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించిందని, రాష్ట్రంలో మన జిల్లాను ఆదర్శవంతంగా నిలపాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో డీఆర్డీవో విద్యాచందన అధ్యక్షతన నిర్వహించిన మహిళ శక్తి పథకంపై అవగాహన సదస్సును ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో అటవీ సంపద పుష్కలంగా ఉందని సరైన విధంగా ఉపయోగించుకుని మహిళలు అభివృద్ధి చెందవచ్చన్నారు. మహిళా సంఘాలు ఏర్పాటు చేసే పరిశ్రమలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించినప్పుడే లక్ష్యం సాధిస్తారన్నారు. జిల్లాలో ఇప్పపువ్వు ఎన్నో పోషక విలువలతో కూడుకుందని బ్రెడ్లు, బిస్కెట్లు తయారుచే చేయాలన్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతికి డిమాండ్ ఉన్న బోడ కాకరకాయ సాగుకు జిల్లాలో నేల అనువైందని సాగుచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందా లన్నారు. ఆసక్తి కలిగిన మహిళలందరికి అయా రంగాల పై శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారి తిరుపతయ్య, లీడ్ బ్యాంక్ మేనేజరు రామిరెడ్డి, మున్సిపల్ కమీషనర్లు, ఏపీఎంలు, మెప్మా సిబ్బంది, సెర్ప్ డీపీఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

స్టడీ అవర్స్‌లో టీచర్లు అందుబాటులో ఉండాలి

▸ గణిత టీచర్‌పై పీవో ఆగ్రహం

దుమ్ముగూడెం, జూలై 23: రాత్రిపూట స్టడీ అవర్‌లో తప్పనిసరిగా సబ్జెక్టు టీచర్లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఐటీడీఏ పీవో బి రాహుల్ ఆదేశించారు. మండలంలోని పెదనల్లబల్లి జీపీఎస్ పాఠశాల, చర్ల మండలం పెదమిడిసిలేరు ఆశ్రమపాఠశాలలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, డార్మెటరీ, వంటగదులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మెనూ ప్రకారం తాజా కూరగాయలతో ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. గణితంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని వెనుకబడి ఉండడాన్ని గమనించి సంబంధిత టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎంలు చంద్రకళ, నాగమణి, టీచర్లున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

బడ్జెట్‌పై భిన్న స్వరాలు

తెలంగాణకు మొండిచేయి..

● సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణాకు మొండిచెయ్యి చూపారని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని, అలాగే రైల్వేకోచ్, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసేలేదన్నారు.రైతుల పంటలకు మద్దతుధర ప్రకటించలేదని, బడ్జెట్‌లో నిరుద్యోగసమస్యపై నిర్దిష్ట ప్రణాళిక లేదన్నారు. మధ్యతరగతి వారికి పైపై మెరుగులు చూపించి, కార్పొరేట్ వర్గాలకు అనుకూల వైఖరి అనుసరించారన్నారు. బడ్జెట్ కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాల బడ్జెట్‌గా ఉందని పోటు రంగారావు విమర్శించారు.

మధ్యతరగతిని విస్మరించిన బడ్జెట్

● సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రధాని మోడీ ఆలోచనలకు అద్దం పట్టేలా ఉందని తప్ప మధ్యతరగతి ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పేర్కొన్నారు. ఎప్పటిలాగానే సంపన్నవర్గాలకు, కార్పొరేట్ శక్తులకు బడ్జెట్ కొమ్ము కాసింది తప్ప పేద, మధ్యతరగతి వారికి ఎటువంటి పథకాలు ప్రకటించలేదన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారని, ఉద్యోగాల కల్పన ఊసే లేదన్నారు. ఆదాయపు పన్ను వర్గాలు, సంపన్నవర్గాల చుట్టూనే బడ్జెట్‌ను తిప్పారని విమర్శించారు.

రైతులను మోసంచేసిన బడ్జెట్

● రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులను, వ్యవసాయరంగాన్ని మోసం చేసిందని తెలంగాణా రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు బడ్జెట్‌లో చూపించలేదన్నారు. ఎరువులకు ఇస్తున్న సబ్సిడీల్లో కోతపెట్టేందుకు పూనుకున్నారన్నారు. 14వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలను పెంచామని రైతులను బడ్జెట్‌ద్వారా మభ్యపెట్టారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి విభజన హామీల అమలుపై బడ్జెట్‌లో ఊసేలేదన్నారు. ప్రాజక్టులకు నిధులు కేటాయించలేదని విమర్శించారు. ● ఖమ్మం కార్పొరేషన్

వికసిత్‌భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

● బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో సోమవారం ప్రవేశపెట్టిన రూ.48.21లక్షల కోట్ల బడ్జెట్‌ను వికసిత్ భారత్ లక్ష్యంగా ఉంది. బడ్జెట్ ప్రజాభీష్టంగా ఉందని, నిరుద్యోగులు, రైతులు, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు. కోటి మంది యువతకు ఉద్యోగాల కల్పన దిశగా రూ.1.48లక్షల కోట్లు కేటాయించడం దేశానికి అన్నం పెట్టే రైతన్న సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి అన్న యోజన పథకం మరో ఐదేళ్ల పొడిగించడం గర్వకారణమన్నారు.7వసారి ఆర్థిక బడ్జెట్ ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని తెలిపారు. ● ఖమ్మం బైపాస్‌రోడ్

భద్రాద్రిపై మోదీ ప్రభుత్వం వివక్ష

● సీపీఎం భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎ.కనకయ్య

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రం పేరు కూడా ప్రొవించలేదని విమర్శించారు. విభజన చట్టం ఫ్యాక్టరీ గురించి బడ్జెట్ ప్రస్తావనలేదని, అలాగే దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం అభివృద్ధికి కూడా నిధులు కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు.

● ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం

తెలంగాణకు మొండిచేయి చూపించిన బీజేపీ

● జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మేడిపండు చందంగా, పక్షపాతంతో కూడుకొని ఉన్నదని తెలంగాణాకు మొండిచేయి చూపించారని, గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు కర్మాగారం గురించి ఊసేలేని బడ్జెట్, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రోడ్లు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా, హ్యాండ్లూమ్‌పార్క్, కొత్త రైల్వేట్రాక్స్ ఇతర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా మొండిచేయ్యి చూపించారని అన్నారు. ● ఖమ్మం

శాంతించిన గోదావరి



తూరుబాక గ్రామం వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

భద్రాచలం, జూలై 23: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం తగ్గుముఖం పట్టింది. ఎగువన భారీ వర్షాలతో గత ఐదు రోజులుగా గోదావరి ప్రవాహం క్రమేపీ పెరుగుతూ తుది ప్రమాద హెచ్చరికకు చేరువగా వచ్చింది. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు 50.6 అడుగులున్న గోదావరి నీటిమట్టం మంగళవారం ఉదయం 9గంటలకు 51.6 అడుగులకు చేరుకొని నాలుగు గంటల పాటు నిలకడగా ఉంది. మధ్యాహ్నం 12గంటలకు 51.4 అడుగులకు తగ్గిన గోదావరి ఈ క్రమంలో సాయంత్రం 6గంటలకు 50.7 అడుగులకు తగ్గింది. నదీ పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరికి వరద తగ్గింది. దాంతో భద్రాచలం వద్ద నీటిమట్టం మరింతగా తగ్గే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా గోదావరి 51అడుగులకు చేరడంతో భద్రాచలంలో నది ఒడ్డున స్నానఘట్టాల వద్ద మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన షెడ్లు పూర్తిగా మునిగిపోయాయి. అలాగే దేవస్థానం కల్యాణ కట్ట కింది భాగం, స్నానఘట్టాలు ముంపునకు గురయ్యాయి.



జాతీయ రహదారిపై తాత్కాలిక కరకట్ట ఏర్పాటు దృశ్యం

పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు

గోదావరి పోటెత్తడంతో ప్రధాన రహదారుల్లో భద్రాచలం నుంచి ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరద భద్రాచలంలోకి రాకుండా కరకట్ట నిర్మాణం చేపడుతుండడంతో భద్రాచలం నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశాకు వెళ్లే కూనవరం రహదారిలోనూ రాకపోకలు నిలిచాయి. అలాగే దుమ్ముగూడెం మండలంలో సున్నంబట్టి గ్రామంలో గత ఐదు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం-పర్ణశాలకు వెళ్లే మార్గంలో పర్ణశాల,తూరుబాకల వద్ద ఉదయం రాకపోకలు నిలిచిపోగా సాయంత్రం ప్రవాహం తగ్గడంతో పునరుద్ధరించారు. బూర్గంపాడు మండలంలోని బూర్గంపాడు-సోంపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బూర్గంపాడు-సారపాక మధ్య ఉదయం రాకపోకలు నిలిచిపోగా సాయంత్రం వరద ప్రవాహం తగ్గడంతో ప్రారంభించారు. అశ్వాపురం మండలంలో భద్రాచలం-రామచంద్రాపురం రహదారిలో కడియాల బుడ్డి వాగుపై వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం ప్రవాహం తగ్గడంతో మళ్లీ ప్రారంభమయ్యాయి.

జాతీయ రహదారిలో తాత్కాలిక కట్ట

భద్రాచలం నుంచి కూనవరం వెళ్లే మార్గంలో ఇటీవల నూతనంగా నిర్మిస్తున్న 800 మీటర్ల కరకట్ట పనులు పూర్తికాకపోవడంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా రహదారిని పూర్తిగా మూసివేసి వరద నీరు భద్రాద్రి పట్టణంలోకి ప్రవేశించకుండా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గోదావరి 60 అడుగులు వచ్చినా భద్రాచలంలోకి నీరు రాకుండా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై మట్టికట్ట పోసి ఇరువైపులా ఇసుక బస్తాలను ఏర్పాటు చేశారు. దీంతో భద్రాచలంలోకి గోదావరి వరద రాలేదు. ఇదిలా ఉండగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గోదావరి వరదను పరిశీలించారు. తాత్కాలిక కరకట్ట వద్దకు వెళ్లి భద్రతపై అధికారులతో మాట్లాడారు.

రుణమాఫీలో ఎన్నో రూల్స్

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక యాప్ ద్వారా సమాచారం


అమ్ముకున్న వారు కూడా తమకు కూడా రుణ మాఫీ వర్తింప జేయాలని అధికారు చుట్టూ తిరుగుతున్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు, రైతులకు సమాచారం అందించేందుకు గాను వ్యవసాయశాఖ మండల అధికారులకు ప్రత్యేక యాప్ అందజేసారు. రుణమాఫీ అమలు జరుగుతున్న క్రమంలో అర్హత ఉన్నా తమకు రూ. లక్షలోపు రుణ మాఫీ కాలేదని కొందరు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వారికి సంబంధించిన డేటాను యాప్‌లో పరిశీలించి స్టేటస్‌ను రైతులకు సమాచారం ఇస్తున్నారు.

ఒక్కో రైతు రుణం ఎంత ఉంది. ఎన్ని బ్యాంకుల్లో ఉంది. రూ.లక్ష దాటి ఉంటే రెండు విడతలో మాఫీ అవుతుందని, అందుబాటులో ఉన్న సమాచారం అధికారులు చెపుతున్నారు. బ్యాంకు రుణ ఖాతాకు ఆధార్ లింక్ కాకపోవటం, ఆహార భద్రత లేని వారికి సంబంధించిన రైతులను నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నారు. రుణ మాఫీ సమాచారం తెలుసుకునే రైతులకు వారికి ఉన్న అనుమానాలను యాప్‌లో పరిశీలించి చెపుతున్నారు. తమ పేరు రుణ మాఫీలో ఉందా లేదా అనే విషయాలు కూడా రైతులు వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకుంటున్నారు.

ఈ క్రమంలో రుణ ఖాతాలో ఉన్న పేరు, ఆధార్‌లో ఉన్న పేరు తేడా ఉంటే వాటిని సరిచేయించుకోవాలని దరఖాస్తు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఐటీ చెల్లింపుదారులు, నాల్గవ తరగతి పైన ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పింఛన్‌దారులకు రుణ మాఫీ వర్తించదు. తమకు రుణ మాఫీ కాలేదని కొందరు అధికారుల వద్దకు రాగా వారి డేటా పరిశీలిస్తే కుటుంబంలో ప్రభుత్వ పింఛన్‌దారులు లేదా ఐటీ చెల్లింపు దారులు ఉన్నట్లు ఉందని అందుకే వర్తించటం లేదని సమాచారం ఇస్తున్నారు.

నారు పోద్దామా.. వద్దా..?

▸ సంకట స్థితిలో వైరా ఆయకట్టు రైతాంగం



వైరా, జూలై 23: వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతాంగం సంకట స్థితిని ఎదుర్కొంటోంది. ఇటీవల కొన్నిరోజులు వర్షాలు కురిసినప్పటికీ రిజర్వాయర్ నీటిమట్టం ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో ఖరీఫ్ సాగుపై రైతాంగం మల్లగుల్లాలు పడుతోంది. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులు కాగా, ప్రస్తుతం 11.6 అడుగుల నీటిమట్టం మాత్రమే ఉంది. దాంతో ఖరీఫ్‌లో వ్యవసాయ పనులపై రైతులు ఎటూ తేల్చుకోలేని సంకట స్థితిలో ఉన్నారు. తరుణం అయిపోతున్నప్పటికీ రిజర్వాయర్‌కు ఆశించిన స్థాయిలో నీరు రాక రైతులకు ఎటూ పాలుపోని పరిస్థితి నెలకొంది.

రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల కింద దాదాపు 25వేల ఎకరాల ఆయకట్టు ఉంది. రిజర్వాయర్ నీటి ఆధారంగానే రైతులు వరిసేద్యం చేయాల్సి ఉంది. తాము వరినార్లు పోసుకునే విషయమై రైతులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ఒకవేళ వరినార్లు పోసుకుంటే రిజర్వాయర్‌లో నీటి లభ్యత లేకపోతే తాము నష్టపోవాల్సి వస్తుందనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ఒకవేళ వరినార్లు పోయకపోతే భవిష్యత్‌లో సమృద్ధిగా వర్షాలు కురిసి రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండితే నాట్లు వేసుకునేందుకు నారు లేక నష్టపోవాల్సి వస్తుందని రైతులు మదనపడుతున్నారు. కొంతమంది రైతులు మాత్రం ధైర్యం చేసి నార్లు పోసుకుంటే నెలరోజుల తర్వాత రిజర్వాయర్ నిండితే నాట్లు వేసుకుందామని లేకుంటే విత్తనాలు, దుక్కుల పెట్టుబడిని నష్టపోతామనే భావనతో ఉన్నారు.

సీతారామ ప్రాజెక్టు నీటిని లింక్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు ఆగస్టు 15నాటికి తీసుకువస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చేస్తున్న ప్రకటనలపై కూడా కొంతమంది రైతులు ఆశగా ఉన్నారు. అయితే పదిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా లింక్ కెనాల్ పనులకు ఆటంకం ఏర్పడుతుండటంతో వైరా ఆయకట్టు రైతుల్లో కొంత ఆందోళన నెలకొంది.

30న 'సీతారామ' ట్రయల్ రన్

● వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

ఖమ్మం, జూలై 23 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి పూసుగూడెం, కమలాపురం 2, 3 పంపుహౌజ్‌ల ట్రయల్‌రన్ కోసం చైనానుంచి నిపుణుల బృందం వచ్చింది. 30వ తేదీన ట్రయల్‌రన్ పూర్తిచేస్తామని, చివరిగా ఆగస్టు 9న మూడు పంపుహౌజ్‌లకు ట్రయల్‌రన్ నిర్వహించి నీరు వదులుతామయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పంపుహౌజ్‌ల ట్రయల్‌రన్‌కు చైనానుంచి నిపుణుల బృందం మంగళవారం వచ్చి పనులు ప్రారంభించిందని, ఈ క్రమంలో ఈ నెల 30న ట్రయల్‌రన్ నిర్వహిస్తారని తెలిపారు. మూడు పంపుహౌజ్‌ల పనులు పూర్తయ్యాయని, ఇప్పటికే బీజీ కొత్తూరు ట్రయల్‌రన్ విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఆగస్టు 9న ట్రయల్‌రన్ చేసి ఏన్కూరు లింకుకెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలు అందిస్తామని తెలిపారు.

ప్రస్తుతం లింకుకెనాల్ పనులకు గ్యాస్‌పైపులైన్ అడ్డంగా ఉన్నందున అక్కడ పనులు వేగంగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఏపీ, గుజరాత్ ప్రధాన కార్యదర్శులను కోరినట్లు తెలిపారు. సీతారామ ఎత్తిపోతలకు సంబంధించిన సబ్‌కాంట్రాక్టర్లు చైనా సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం చెల్లింపులు చేయకపోవడంతో గత రెండేళ్లుగా సాంకేతిక బృందం పంపుహౌజ్‌లను సందర్శించలేదని తుమ్మల తెలిపారు. ఈ విషయంపై ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్‌బొజ్జ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఢిల్లీ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌తో చర్చించామని, విదేశీ మంత్రిత్వశాఖ ద్వారా చైనా బృందానికి వీసాలు మంజూరు చేయించి వారిని రప్పించామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గోదావరి జలాలను పంపుహౌజ్‌ల ద్వారా వైరా రిజర్వాయర్‌కు అందిస్తామని తెలిపారు.

ఖమ్మంలో 27, 28న అయ్యప్ప ధర్మప్రచార సభలు

ఖమ్మంసాంస్కృతికం, జూలై 23: ఖమ్మం జిల్లా కేంద్రంలో 27, 28 తేదీల్లో అయ్యప్పధర్మప్రచార సభలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర కార్యదర్శి టీవీ పుల్లంరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మినర్వాగ్రాండ్ హోటల్‌లో 27న రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం, 28న జాతీయ కార్యవర్గసమావేశంతో పాటు రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకుంటారని తెలిపారు. తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్ష కార్యదర్శులతో పాటు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఈ సభల్లో పాల్గొంటారని, జాతీయ సమావేశాలకు ఏబీఏపీ జాతీయ జాతీయ అధ్యక్ష కార్యదర్శులు అయ్యప్పదాస్, బెల్లపు హరిప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఎరుమేలి నుంచి పంబవెళ్లే మార్గంలో శివకోయల్ వద్ద నిర్మించనున్న అన్నదాన ట్రస్ట్‌భవనం గురించి, అయ్యప్ప మహాపడిపూజ గురించి, రాబోయే అయ్యప్ప దీక్షా కాలంలో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాల గురించి ఈ సమావేశాల్లో చర్చ ఉంటుందని తెలిపారు.

ఓసీలో పేలుళ్లతో...

దెబ్బతింటున్న ఇళ్లు

- క్షణ క్షణం భయంతో కాలం వెళ్లదీస్తున్న కిష్టారం కాలనీ వాసులు
- ప్రభుత్వాలు మారినా పరిష్కారం కాని సమస్య



:కిష్టారంలో ఒక ఇంటిలో ఊడి పడిన స్లాబు పెచ్చులు(ఇన్‌సెట్‌లో పగుళ్లిచ్చిన ఇంటి గోడ)

సత్తుపల్లి, జూలై 23: సత్తుపల్లి మండలం కిష్టారంలో ఓపెన్ కాస్టు బొగ్గు గని తవ్వకాల్లో భాగంగా బ్లాస్టింగ్ వల్ల సమీపంలోని కాలనీల్లోని ఇళ్లు దెబ్బతింటున్నాయి. ఇప్పటికే పలు ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. సత్తుపల్లి మండలంలో సింగరేణి బొగ్గు గనుల ప్రభావిత ప్రాంతాల్లో కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. తమకు న్యాయం చేయాలని బాధితులు ఎప్పటికప్పుడు ఆందోళనలు చేస్తున్నా, సంస్థ నుంచి కాని, ప్రభుత్వం నుంచి కాని స్పందన లేకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కిష్టారం ఓసీ బొగ్గు తవ్వకాల్లో జగన్నాథపురం మొత్తం కనుమరుగైంది. జగన్నాథపురం గ్రామస్థులకు పునరావాసం కల్పించి వారికి చెరుకుపల్లి సమీపంలో పునరావాస కాలనీ నిర్మించారు. కిష్టారం ఓపెన్ కాస్టు బొగ్గు గనికి అతి సమీపంలోని కిష్టారం గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలున్నాయి. ఇక్కడ 175 పక్కా గృహాల్లో ఎస్సీ, బీసీ, మైనారిటీ కుటుంబాలు ఉన్నాయి. కొన్ని ఇళ్లలో రెండు నుంచి మూడు కుటుంబాలు కూడా ఉంటున్నారు.

ఓపెన్ కాస్టు బొగ్గుగనిలో బొగ్గు తవ్వకాల్లో భాగంగా బ్లాస్టింగ్ చేయడం ప్రతి రోజు సాధారణంగా జరుగుతూనే ఉంటుంది. ఓసీలో బ్లాస్టింగ్ చేసిన ప్రతి సారీ కాలనీలో ఇళ్లు ఒక్క సారిగా అదిరిపోతున్నాయి. బ్లాస్టింగ్ వైబ్రేషన్‌కు ఇళ్ల స్లాబులు పెచ్చులుగా ఊడి పడిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఇళ్ల గోడలు బీటలు వారాయి. కొన్ని ఇళ్ల స్లాబులు లీకవుతూ వర్షం నీరు మొత్తం ఇంటిలో కారుతోంది. ఇళ్లు ఇప్పుడు కుప్పకూలుతాయో తెలియక భయభ్రాంతులకు గురవుతున్నామని మహిళలు చెబుతున్నారు. ఇళ్ళు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇంటిని వదిలేసి పట్టాలు కింద కాలం వెళ్లదీస్తున్నామని చెపుతున్నారు.

పునరావాసం కల్పించాలి

తమకు పునరావాసం కల్పించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎస్సీ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పలు సందర్భాల్లో ఆందోళనలు నిర్వహించగా, అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చి పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం సింగరేణి అధికారులు మాత్రం పునరావాసంపై మాట్లాడకుండా ఇళ్లు మరమ్మతులు చేయిస్తామంటున్నారని, మరమ్మతులు తమకు అవసరం లేదని చెబుతున్నారు. గతంలో పిల్లర్లతో కాలనీలో ఇళ్లు నిర్మించలేదని, మరమ్మతులు చేసినా, ఇళ్లు మళ్లీ శిథిలమవుతాయని వాపోయారు. తమకు జగన్నాథపురం పునరావాస కాలనీ తరహాలో వేరే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. న్యాయం చేస్తామంటూ హామీలు ఇవ్వడం తప్ప, ఏళ్లు గడుస్తున్నా ఫలితం కనిపించడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కిష్టారంలోని అంబేద్కర్‌నగర్ వాసుల పరిస్థితి కూడా భిన్నంగా లేదు. అంబేద్కర్‌నగర్ సమీపంలో నిర్మించిన సీహెచ్‌పీ లోడింగ్ పాయింట్ వద్ద నుంచి వచ్చే కాలుష్యం కారణంగా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో అనేక సందర్భాల్లో వారు ఆందోళన చేసినా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తమకు కాలుష్యం నుంచి విముక్తి కల్పించాలని ప్రత్యామ్నాయ స్థలం చూపి ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

కిష్టారం ఓసీ, జేవీఆర్ ఓసీ-2 ప్రభావిత ప్రాంతాల ప్రజల సమస్యలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అసెంబ్లీలో ప్రస్తావించారు. గత అసెంబ్లీ సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ కిష్టారం ఓసీలో బ్లాస్టింగ్ వల్ల కిష్టారం ఎస్సీ కాలనీలో ఇళ్లు దెబ్బతిన్నాయని, సైలో బంకర్ వద్ద లోడింగ్ కారణంగా అంబేద్కర్‌నగర్ వాసులు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వానికి వివరించారు. వారికి న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు.

బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు కురుస్తోంది



● పత్తిపాటి మరియమ్మ

బ్లాస్టింగ్ వల్ల మా ఇంటిలో నాలుగు గదులు కురుస్తున్నాయి. నాలుగేళ్ల నుం చి సింగరేణి అధికారులు వస్తున్నారు, చూస్తున్నారే కానీ మాకు ఎటువంటి న్యాయం జరగడం లేదు. గతంలో పెచ్చులూడి నాపై పడి గాయాలయ్యాయి. బ్లాస్టింగుల కారణంగా స్లాబ్ దెబ్బతిని ఊసలు బయటకు కనిపిస్తున్నాయి. న్యాయం చేయాలి.

న్యాయం జరగడం లేదు



● రాయల రమణ, కిష్టారం

సింగరేణి ఓసిలో బ్లాస్టింగ్ కారణంగా సమస్యలు ఎదురవుతున్నాయి. ఎందరు నాయకులకు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదు. బాంబ్ బ్లాస్టింగ్‌కు ఇళ్లన్నీ కదిలిపోతున్నాయి, వర్షాలకు స్లాబ్ కురుస్తున్నాయి. పెచ్చులూడి మనుషులపై పడుతున్నాయి. గతంలో పలుమార్లు పలువురు గాయపడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఎప్పుడు కూలుతుందో తెలియదు



● తోట సంతోషమ్మ

పెచ్చులూడి మొత్తం ఊడిపోయి స్లాబ్ దెబ్బతింది. ఇంటి స్లాబ్ మొత్తం కురుస్తోంది. ఎప్పుడు కూలుతుందోనని భయంభయంగా గడుపుతున్నాం. ఇంటిపై పరదాలు కప్పుకుని కొన్నేళ్లుగా ఉంటున్నాను. స్లాబ్‌లో సువ్వలు బయటపడి విద్యుత్ షాక్ వస్తుంది. బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నా.

ఇళ్లలో ఉండలేకపోతున్నాం..



● పత్తిపాటి నాగేంద్రమ్మ

ఇంటిపై స్లాబ్ నుంచి పెచ్చూలూడి మా పిల్లలపై పడడంతో భయపడి ఇంటి బయటకు వచ్చాం. ఇలాంటి పరిస్థితి ఉంటే ఇళ్లలో ఎలా ఉండాలని, సింగరేణి అధికారులకు గతంలో ఎన్నోసార్లు చెప్పినా, పట్టించుకోవడం లేదు. మాకు పునరావాసం కల్పించాలి.

అవకాశం కల్పిస్తాం..నమ్మకాన్ని నిరూపించుకోండి

● కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మొక్క నాటుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఎర్రుపాలెం జూలై 23: స్వయం శక్తితో ఎదిగేందుకు అవకాశం కల్పిస్తాం.. ఆ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం మండలంలో మీనవోలు గ్రామంలో గల నాలెడ్జ్ సెంటర్‌లో జరిగిన ఇందిరా మహిళా డైరీ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందిరా మహిళా డైరీ నిర్వహణ, పాల వ్యాపారం, నాణ్యత, మార్కెటింగ్ తదితర అంశాలపై మహిళలతో చర్చించారు. అంతేగాక స్వయం ఉపాధి ఏర్పాటు చేసి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్పత్తి అయ్యే వస్తువులకు మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి వ్యాపారాలను పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారం చేయదలచిన వారికి శిక్షణ ఇచ్చి, మహిళా సఘాల సమన్వయ సహకారంతో ఉపాధికల్పన ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. దీంతో పాటు రుణాలను కూడా ప్రభుత్వం ద్వారా అందిస్తామని అన్నారు. ఎర్రుపాలెంలో ఇందిరా మహిళా డైరీ ఏర్పాటు కోసం పాల శీతలీకరణ కేంద్రానికి కావాలసిన స్థలాన్ని, నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాన్ని ఆయన పరిశీలించారు. మండలంలో 18 గ్రామాల్లో పాడి రైతులు పాలసేకరణ చేస్తున్నారని, ప్రస్తుతం 3వేల లీటర్లు ఉత్పత్తి చేస్తున్నట్లు గమనించామని అన్నారు. మహిళలకు పరిపూర్ణ అధికారుల ద్వారా 30 నుంచి 40 వేల లీటర్లు పాల ఉత్పత్తి సామర్థ్యం ఇక్కడ ఉందని అన్నారు. ఇందిరా మహిళా డైరీ నిర్వహణకు మహిళా సమాఖ్య సంఘాలు పరస్పర సమన్వయంతో వ్యాపార అభివృద్ధికి, లాభనష్టాలకు అవసరమైన నిర్ణయాధికారం వారికే ఇస్తున్నట్లు తెలిపారు. నాలెడ్జ్ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో సన్యాసయ్య, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి వేణు మనోహర్, డీఎల్‌డీవో కె.కిషోర్, అడిషనల్ ఆర్‌డీవో మహమ్మద్ నూరుద్దీన్. తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీవో సురేందర్, ఖమ్మం విజయడైరీ మేనేజర్ సిద్దేశ్వర్ గోతమి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు టి.సుహాసిని, ఇందిరా డైరీ అధ్యక్షురాలు అన్నపూర్ణ, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, సమాఖ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విప్లవోద్యమానికి చంద్రశేఖర్ జీవితం ఆదర్శనీయం

● సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



సభలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఇల్లెందు టౌన్, జూలై 23 : జీవితమంతా విప్లవోద్యమానికే అంకితం చేసి పని చేసిన రాయల చంద్రశేఖర్ పోరాట స్ఫూర్తిని విప్లవ శ్రేణులు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఇల్లెందు ఎల్లన్న భవనంలో నిర్వహించిన రాయల చంద్రశేఖర్ సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రశేఖర్ చిన్న వయస్సులోనే కుటుంబ ప్రేరణతో విప్లవోద్యమానికి ఆకర్షితుడై విప్లవ విద్యార్థి ఉద్యమంలో ప్రయాణం ప్రారంభించారని వివరించారు. అనతికాలంలోనే రహస్య జీవితాన్ని కొనసాగించారని పేర్కొన్నారు. సరైన విప్లవ పంథాలను నిలపెట్టడం కోసం అనేక ఒడుదుడుకులు, నిర్బంధాలు, జైలు జీవితం, అక్రమ కేసులు అనుభవించారన్నారు. మిత్రద్రోహుల నుంచి అవమానాలు, హేళనలు వచ్చిన విప్లవోద్యమం గుండెధైర్యంతో నిలబడిన చంద్రశేఖర్ అనూహ్యంగా ఆత్మహత్యకు పాల్పడటం విచారకరమన్నారు. ఉమ్మడి పార్టీ నుంచి ఖమ్మం జిల్లా నాయకుడిగా పార్టీ రాష్ట్ర నాయకుడిగా మాస్‌లైన్ కేంద్రకంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా తన బాధ్యతలను క్రియాశీలకంగా సమర్థవంతంగా నిర్వహించారని వివరించారు. చివరి వరకు ప్రజాపంథా రాజకీయాల పట్ల విశ్వాసంతో సైద్ధాంతిక రాజకీయ పోరాటం కొనసాగించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు సాధించాలని అన్నారు. ఈ సంతాపసభలో మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చల రంగారెడ్డి, చంద్ర అరుణ, ముద్దా భిక్షం, పాయం చిన్నచంద్రన్న, నాయిని రాజు, మాచర్ల సత్యం,జాటోత్ కృష్ణ, వాంకుడోత్ అజయ్, కాంపాటి పృథ్వి, వై. సావిత్రి, కుమార్, అజ్మీర బిచ్చ, ఆర్. బోసు, ఎస్‌కే. యాకూబ్ షావలి, పాయం వెంకన్న, బుర్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● టీజీఎస్‌పీబీ ఏడీజీపీ సంజయ్‌కుమార్ జైన్



బెటాలియన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఏడీజీపీ సంజయ్‌కుమార్ జైన్

సత్తుపల్లి, జులై23: బెటాలియంలో సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీజీఎస్‌పీ అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్‌జైన్ అన్నారు. మంగళవారం మండలంలోని గంగారం 15వ ప్రత్యేక బెటాలియన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో బీటీసీ ట్రైనింగ్ సెంటర్, మైన్ ఆఫీస్, ఫైరింగ్ రేంజ్‌లను సందర్శించారు. అనంతరం బెటాలియన్‌లో అధికారులు, సిబ్బందితో కలిసి దర్బార్ కార్యక్రమంలో పాల్గొని సిబ్బంది, అధికారులతో మాట్లాడి వారివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పటాలపు కమాండెంట్ పీజేపీ.చటర్జీ, అదనపు దళాధిపతి పీ.వెంకట్‌రాములు, సహాయ దళాధిపతులు ఏ.తిరుపతి, రంగారెడ్డి, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సత్తుపల్లిరూరల్, జులై23: అక్రమంగా తరలిస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన సిద్దారంలో చోటుచేసుకుంది. ఆంధ్రాలోని పుట్రేల సమీపంలోని కోళ్లఫారాలకు తరలిస్తున్న 2టన్నుల రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యం నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందాలి

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, జూలై23: బస్తీదవాఖానాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందాలని ఖమ్మం నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. మంగళవారం కమిషనర్ వైఎస్సార్‌కాలనీ, పాత కార్పొరేషన్ కార్యాలయంలోని బస్తీదవాఖానాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు ఏ సమయంలో వచ్చి, ఏ సమయంలో వెళ్లిపోతున్నారో వైద్యం కోసం వచ్చినవారిని అడిగి తెలుసుకున్నారు. బస్తీదవాఖానాల్లో నమోదైన డెంగ్యూ కేసులు, దానికి సంబంధించి అందచేస్తున్న మందుల వివరాలను మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. బస్తీదవాఖానాకు వచ్చే రోగుల వివరాలకు సంబంధించిన రిజిస్టర్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ బస్తీదవాఖానాల్లో అన్ని మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యులు అందుబాటులో ఉండి, సమయపాలన పాటించాలని కమిషనర్ పేర్కొన్నారు. బస్తీదవాఖానాల్లో వసతులు సరిగా ఉండాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

నాటుసారా పట్టివేత



నాటుసారాతో పట్టుబడ్డ నిందితుడు

దుమ్ముగూడెం, జూలై 23: మండల పరిధిలోని సున్నాన పురానికి చెందిన భూక్యా వీరన్న మంగళవారం వంద లీటర్ల నాటుసారాను తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య వరద సంరక్షణ విధులు నిర్వహిస్తున్న క్రమంలో కాటాయిగూడెం వద్ద అనుమానాస్పద స్థితిలో వీరన్న ఒక తెల్లటి బస్తాతో కనిపించాడు. అతడిని ఆపి పరిశీలించగా బస్తాలో రూ.30వేల విలువగల వందలీటర్ల నాటుసారా ప్యాకెట్లు కనిపించాయి. అతడిపై ఏఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ, జూలై 23 : కుటుంబ కలహాలతో పురుగుమందు సేవించి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చంద్రాలగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాలగూడెం గ్రామానికి చెందిన కల్తీ నరసింహారావు(45) స్థానికంగా వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అతడు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే తన భార్యతో మద్యానికి కావాల్సిన డబ్బుల విషయంలో గొడవపడ్డాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని గమనించిన కుటుంబ సభ్యులు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య కల్తీ నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కూరగాయలలోడు వ్యాన్ ఫల్టీ: ఒకరి మృతి



ప్రమాదంలో మృతి చెందిన ధర్మారావు

కొణిజర్ల, జూలై23: ఆర్టీసీ బస్సు ఢీకొని కూరగాయాల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ బోల్తా పడడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొణిజర్ల సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్‌రావు తెలిపిన వివరాలు ప్రకారం.. ఖమ్మం నుంచి కూరగాయలు కొనుగోలు చేసుకొని మధిర మండలం జీలుగుమాడు గ్రామానికి చెందిన కూరగాయాల వ్యాపారి ఎర్రబోలు ధర్మారావు(51), మరో వ్యాపారితో కలిసి మధిరలో కూరగాయలను కొనుగోలు చేసి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కొణిజర్ల సమీపంలోకి ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎదుటివాహనాన్ని తప్పించబోయి, వెనుక వస్తున్న కూరగాయల లోడు వ్యాన్‌కు తగిలింది. దీంతో వ్యాన్ ఫల్టీ కొట్టింది. దీంతో వ్యాన్‌పైన ఉన్న కూరగాయల వ్యాపారి ధర్మారావు కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కృష్ణకుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో

మందుల కొరత

- నెలల తరబడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందని మందులు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



జూలూరుపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జూలూరుపాడు, జూలై 23: ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి, ప్రజలకు ఆధునాతన వైద్య సేవలను అందిస్తున్నామని, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచామని ప్రభుత్వం, వైద్యశాఖ ప్రచారం చేసుకుంటుంది. కాగా సర్కార్ ఆస్పత్రులకు వైద్యం చేయించుకోనేందుకు వచ్చిన రోగులకు, తీవ్ర నిరాశే ఎదురవుతుంది. ఆస్పత్రుల్లో గత కొన్ని నెలలుగా అవసరమైన ఔషధాల నిల్వలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మందు బిళ్లలు అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రులకు వచ్చిన రోగులకు మందులు ఇవ్వలేక వైద్య సిబ్బంది కూడా తలలు పట్టుకోవాల్సి వస్తుంది. భద్రాద్రి జిల్లాలో 4 సీహెచ్‌సీలతో పాటు 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 181 హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు ఉన్నాయి.

10నెలలుగా అందని మందులు

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10 నెలల నుంచి ఔషధాల కొరత ఏర్పడింది. కనీసం జ్వరం, జలుబు, దగ్గు వ్యాధులకు సంబంధించిన మాత్రలు కూడా అందుబాటులో లేని పరిస్థితి. ఔషధాల కొరత కారణంగా రోగులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో ఆసుపత్రుల్లో మందులు లేకపోవడంతో బయట కొనుక్కోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఔషధాలు లేకపోవడంతో వర్షాకాలంలో గ్రామాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం కష్టంగా మారిందని వైద్య సిబ్బంది చెబుతుండటం గమనార్హం.

ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో ప్రభుత్వం ఆసుపత్రులకు అవసరమైన మందులను సరఫరా చేయక పోవడం గమనార్హం. ఆసుపత్రుల్లో జ్వరం, జలుబు, దగ్గు తదితర వ్యాధులకు సంబంధించిన ఔషధాలు లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే ఏజెన్సీలోని పలు ప్రాంతాలలో సీజనల్ వ్యాధులతో ప్రజలు మంచాన పడుతున్నారు. వీరికి అవసరమైన మందు బిళ్లలు సమీపంలోని సర్కార్ ఆస్పత్రుల్లో లభించకపోవడంతో కొందరు బయట కొనుగోలు చేయాల్సి వస్తుంది. నెల నెల ప్రభుత్వానికి ఔషధాలు అందించాలని వైద్య సిబ్బంది ఇండెంట్‌ను పంపుతున్నప్పటికీ, సరఫరా చేయడం లేదని వైద్య సిబ్బంది చేపుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, వైద్యశాఖ ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తక్షణమే ప్రభుత్వాసుపత్రులకు ఔషదాలను సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ఇండెంట్‌ను అందించాం

● భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో



కొన్ని రకాల మందులు ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులో లేని మాట వాస్తవమే. ప్రభుత్వాసుపత్రుల్లో మందుల కోసం ప్రభుత్వానికి ఇండెంట్‌ను అందించడం జరిగింది. త్వరలోనే మందులు ఆసుపత్రులకు సరఫరా చేసే విధంగా చర్యలు చేపడతాం

నాటుసారా విక్రయిస్తున్న మహిళపై కేసు

జూలూరుపాడు, జూలై 23: నాటుసారాను తయారు చేసి విక్రయిస్తున్న మహిళపై మంగళవారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాచినేనిపేట పంచాయతీ పరిధిలోని గోపాతండా గ్రామానికి చెందిన భూక్య లచ్చి అనే గిరిజన మహిళ నాటుసారాను తయారు చేసి విక్రయిస్తుంది. ఈ క్రమంలో తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా, ఆమె వద్ద నాలుగు లీటర్ల సారా పట్టుబడిందని తెలిపారు. సదరు మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిట్‌ఫండ్ కలెక్షన్ ఏజెంట్‌పై కేసు

మణుగూరుటౌన్, జూలై 23: మణుగూరుకు చెందిన ఓ బాధితురాలు ఓ చిట్‌ఫండ్‌లో తనకు జరిగిన మోసంపై పోలీసులను ఆశ్రయించింది. మంగళవారం బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం..మణుగూరు ఓ చిట్‌ఫండ్ బ్రాంచ్‌లో మణుగూరుకు చెందిన ఎండీ షహీదా చిట్టీలు వేసింది. చిట్ కలెక్షన్ కోసం మణుగూరులోని ఓ చిట్‌ఫండ్ బ్రాంచ్‌కి చెందిన కలెక్షన్ ఏజెంట్ అవినాష్, షహిదా బేగం నుంచి రూ.3.40లక్షల నగదు తీసుకుని, చిట్‌ఫండ్‌కు సంబంధించి బుక్‌లో ఎంట్రీలు రాసి బ్రాంచ్ కార్యాలయంలో జమ చేయలేదు. కాగా ఇటీవల చిట్ కాలపరిమితి ముగియడంతో నగదు కోసం బ్రాంచ్ కార్యాలయాన్ని సంప్రదించగా.. అసలు చిట్ నగదు కట్టలేదని, చిట్టికి సంబంధించిన నగదు ఆఫీస్‌లో జమకాలేదని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారని పేర్కొంది. దీంతో తాను మోసపోయానని గ్రహించిన ఆమె మణుగూరు సీఐ సతీష్‌కుమార్‌ను ఆశ్రయించి, తనకు జరిగిన మోసంపై సదరు బ్రాంచ్ మేనేజర్ విజయ్‌కుమార్, కలెక్షన్ బాయ్ చేసిన మోసంపై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసిన విచారణ చేపట్టారు. ఈ విషయమై సీఐ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా.. విచారణ చేస్తున్నామని, చిట్‌ఫండ్‌తో పాటు ఇతర ప్రైవేటు చిట్‌ఫండ్‌లలో కలెక్షన్ ఏజెంట్‌లకు నగదు చెల్లించిన వెంటనే, సదరు బ్రాంచ్ మేనేజర్లకు సమాచారమిచ్చి రశీదులు పొందాలని సూచించారు.

రుణమాఫీ అమలు ఎలా ఉంది: జేడీఏ



రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న విజయనిర్మల

వైరా, జూలై 23: రుణమాఫీ అమలు సక్రమంగా జరిగిందా... రుణమాఫీ అయిన రైతులు సంతోషంగా ఉన్నారా అని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయనిర్మల ఆరా తీశారు. మంగళవారం మండలంలోని తాటిపూడి, ఖానాపురం గ్రామాల్లో రుణమాఫీ అమలుపై రైతులతో ముఖాముఖీ చర్చా కార్యక్రమాలను నిర్వహించారు. రుణమాఫీ లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ ఎంతమందికి వచ్చింది, మీరంతా సంతోషంగా ఉన్నారా అంటూ ప్రశ్నించారు. రుణమాఫీ పొందిన వారు, తిరిగి సకాలంలో బ్యాంకుల నుంచి పంటరుణాలు తీసుకున్నారా, బ్యాంకుల వారు సక్రమమైన పద్ధతిలో తిరిగి మళ్లీ పంటరుణాలు ఇస్తున్నారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ పొందిన రైతులు తాము సంతోషంగా ఉన్నామని తిరిగి పంటరుణాలు తీసుకుంటున్నామని తెలిపారు. ఖానాపురం రైతువేదికలో దృశ్యవాణి మాధ్యమం ద్వారా రైతులకు సలహా ఇచ్చే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అలాగే పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఎలాంటి కొరత లేదని రైతులకు వివరించారు. వైరా ఏవో ఎస్.పవన్‌కుమార్, ఏడీఏ ఆఫీసు టెక్నీకల్ ఏవో వాహిని, జడ్పీకోఆప్షన్ సభ్యుడు షేక్.లాల్‌మహ్మద్ వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, అభ్యుదయ రైతు తుమ్మల రాణాప్రతాప్, పలువురు మాజీ సర్పంచ్‌లు, ఏఈవోలు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పాల్వంచ, జూలై 23: వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై మంగళవారం పాల్వంచ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ కుటుంబంతో పరిచయం ఏర్పర్చుకున్న అశోక్ ఈ మధ్యకాలంలో సదరు మహిళతో అసభ్యంగా ప్రవర్తించ సాగాడు. ఆమె భర్తతో చెప్తే చంపుతానని బెదిరించాడు. ఈ విషయమై సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బాణాల రాము తెలిపారు.

ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తి

పెనుబల్లి, జూలై 23: సైకో చేష్టలతో ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసి వీరంగం సృష్టించిన సంఘటన మంగళవారం నాయకులగూడెం శివారులోని ముత్యాలమ్మ గుడి వద్ద జరిగింది. నాయకులగూడెం గ్రామానికి చెందిన దుంపా పుల్లారావు అనే వ్యక్తి గ్రామ శివారులో ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆలయంలో విగ్రహాన్ని తల, మొండెంను వేరు చేసి గుడిలోనుంచి బయటకు తీసుకువచ్చి 20అడుగుల దూరంలో పెట్టాడు. దీంతోపాటు దేవతా విగ్రహానికి ఉన్న చీరను కట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశాడు. పుల్లారావు చేష్టలు చూసిన గ్రామస్థులు ఆందోళన చెంది ఎవరూ కూడా దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయలేదు. ఆలయం నుంచి దేవతా విగ్రహాన్ని బయటకు తీసుకురావడంతో గ్రామానికి అరిష్టం జరుగుతుందేమోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

వైరా, జూలై 23: వైరాలో సోమవారం రాత్రి ఆరుగురు పేకాట రాయుళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వైరాకు సమీపంలోని ఓ మామిడితోటలో పేకాట ఆడుతున్నరన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.19,500నగదును స్వాధీనం చేసుకున్నారు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాల్వంచ, జూలై 23 : పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టణ పరిధిలోని రామ్‌నగర్ లో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారు అన్న సమాచారం మేరకు దాడి చేసిన పోలీసులు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుండి 19వేల రూపాయల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బాణాల రాము తెలిపారు.

సీపీఎం నాయకుడు లెనిన్ మృతి

నేలకొండపల్లి, జూలై23: మండల పరిధిలోని మూటాపురం గ్రామానికి చెందిన మండల సీపీఎం నాయకుడు చావా లెనిన్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ప్రస్తుతం ఆయన ఖమ్మం పెద్దతండాలో నివాసం ఉంటున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి కుమారుడు ఒకరు విదేశాలలో ఉండటంతో వచ్చేందుకు సమయం పడుతుండటంతో భౌతికకాయాన్ని మమతా వైద్యశాలలో ఉంచారు. అంత్యక్రియలు గురు లేదా శుక్రవారం నిర్వహించనున్నట్లు సమాచారం. లెనిన్ మృతదేహాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు భాగం హేమంతరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, రచ్చా నర్సింహారావు, ఇంటూరి అశోక్, బెల్లం లక్ష్మి, గుడిమళ్ల మధు సందర్శించి నివాళులర్పించారు.

ద్విచక్ర వాహనం చోరీ

జూలూరుపాడు, జూలై 23: గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిన సంఘటనపై మంగళవారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని పడమట నర్సాపురం గ్రామానికి చెందిన లేళ్ల అప్పిరెడ్డి తన ఇంట్లో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని పెట్టి నిద్రపోయారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో ద్విచక్ర వాహనాన్ని దొంగలించారు. మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంఘటన స్థలాన్ని ఎస్ఐ రాణా ప్రతాప్ సందర్శించి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

చోరీకి గురైన ద్విచక్ర వాహనం పట్టివేత

మధిరటౌన్, జూలై23: మధిర పట్టణంలో ఇటీవల చోరీకి గురైన ద్విచక్ర వాహనాన్ని టౌన్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. టౌన్ ఎస్ఐ సంధ్య తెలిపిన వివరాల ప్రకారం.. మధిర పోలీసులు నందిగామ బైపాస్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఓ మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై వస్తుండగా, అతడిని ఆపి ఆ వాహనాన్ని పరిశీలించారు. విచారణలో అది మధిరలో ఇటీవల చోరీకి గురైన వాహనంగా గుర్తించారు. మధిర పట్టణానికి చెందిన యండి. రెహమాన్ తన ఇంటి ముందు ఉన్న బైక్ చోరీకి గురైందని, జూలై 15న పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదే బైక్‌ను నేడు పట్టుబడినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పరిమిత వర్కర్లను నియమించాలి

మణుగూరు, జూలై 23: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకే ఓసీ భారీ యంత్రాల మడ్ క్లీనింగ్ కాంట్రాక్టు పనుల్లో పరిమిత వర్కర్లను మాత్రమే ఏర్పాటు చేసేలా యాజమాన్యం చర్యలను తీసుకోవాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో నాయకులు కార్మికులు మంగళవారం గని ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందించారు. నాయకులు నాసర్ పాషా మాట్లాడుతూ.. సంబంధిత కాంట్రాక్టర్ ఈ పనులకు పరిమితిని మించి కాంట్రాక్టు కార్మికులు పెడుతున్నారని దీంతో మస్టర్లు దొరకక కొందరు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోజుకు 30 మస్టర్లకు గానూ 42 మంది పనిచేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై పలు సార్లు చెప్పినా కూడా సంబంధిత కాంట్రాక్టర్ పెడచెవిన పెడుతున్నారని ఆరోపించారు. దీంతో ఈ విషయంపై సంతకాల సేకరణతో వినతి పత్రాన్ని అందించామని తెలిపారు. టెండర్ పూర్తి అయినా మరో ఆరునెలల కాలం పొడిగించడంతో ఇతని వైఖరికి పట్టు పగ్గాలు లేకుండా పోయిందన్నారు. ఈ విషయంపై లేబర్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ప్రయాణికుల అవసరాల మేరకు బస్ సర్వీసులు

» లహరి బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం » నేటినుంచి ప్రమాదరహిత వారోత్సవాలు

భద్రాచలం, జూలై 23: ప్రయాణీకుల అవసరా లమేరకు నూతన బస్సు సర్వీసులను గుర్తించి అందుకు అనుగుణంగా వాటిని నడిపేందుకు చర్యలు చేపడతామని ఇటీవల భద్రాచలం ఆర్టీసీ నూతన డిపో మేనేజరుగా బాధ్యతలు చేపట్టిన తిరుపతి అన్నారు. భద్రాచలం డిపో నుంచి బెంగుళూరు, యాదాద్రి ఇతర సర్వీసులు ఏర్పాటు చేస్తే ప్రయాణీకులకు సౌలభ్యంగా ఉంటుందనే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

భద్రాచలం ఆర్టీసీ డిపో ఆదాయం మరింతగా పెంచే దిశగా చర్యలు చేపడతామన్నారు. భద్రాచలం డిపోలో ఆర్టీసీకి 89 బస్సులుండగా 24 అద్దె బస్సులున్నాయని తెలిపారు. 19 బస్సులు 12 లక్షల కి.మీ. ఇప్పటికే ప్రయాణించాయని వాటి స్థానంలో త్వరలో కొత్త బస్సులు భద్రాచలం డిపోకు కేటాయించే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి చరిత్రలో తొలిసారిగా భద్రాచలం డిపోకు రెండు ఏసీ లహరి బస్సులు కేటాయించారని వీటిని భద్రాచలం నుంచి బీహెచ్ఈఎల్‌కు ఈ బస్సు ప్రయాణం సాగుతోందన్నారు. బుధవారం నుంచి డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు ఒక అంశంతో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఆర్టీసీ సీఐ గౌతమి, ఎస్ఎం అల్లం నాగేశ్వరరావులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా లహరి బస్సులను మంగళవారం రాత్రి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించారు.



లహరి బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పెదవాగుకు గండి

» మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేట, జూలై 24: ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే పెదవాగు ప్రాజెక్టుకు గండి పడిందని, ఈ విషయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో చర్చకు వచ్చేల కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పెదవాగు ప్రాజెక్టు, కొత్తూరు గ్రామాలలోని ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను పరామర్శించారు. ఇసుకమేటలు వేసిన పంట పొలాలను పరిశీలించారు. ఇటీవలే విద్యుత్ మోటార్ షార్క్ సర్క్యూట్ అయి మృతి చెందిన కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన ఒక్కో ప్యాకెట్టు రూ.1500లు విలువగల నిత్యావసర వస్తువులను 42 మంది నిర్వాసిత కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంకప్రసాదరావు, మాజీ జడ్పీటీసీ జూపల్లి రమణారావు, తాడేపల్లి రవి, జుజ్జూరు వెంకన్నబాబు, సత్యవరపు సంపూర్ణ, కాసాని చంద్రమోహన్, చరణ్, పుట్ట సత్యం, సాయిల సత్యం తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

వరద ప్రాంతాల్లో అధికారుల పర్యటన

» తగ్గుముఖం పట్టిన గోదావరి ఉధృతి

దుమ్ముగూడెం జూలై 23:మండలంలోని వరదముంపు ప్రాంతాల్ని ఏఎస్పీ అంకిత్‌కుమార్ మంగళవారం సందర్శించారు. తూరుబాక, సున్నంబట్టి, పర్ణశాల ప్రాంతాల్లో వరదతీరును పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. గతంలో సంభవించిన వరదలు, పడిన ఇబ్బందులను తెలుసుకున్నారు. అలాగే ప్రజారోగ్యశాఖ అడిషనల్ డైరక్టర్ అమర్‌సింగ్, డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్, ప్రోగ్రాం అధికారులు బాలాజీ నాయక్, చైతన్య, సీఐ అశోక్, ఎంపీడీఓ ముత్యాలరావులు సున్నంబట్టి గ్రామాన్ని నాటుపడవపై సందర్శించారు. వైద్యారోగ్యశాఖ చేపట్టిన ఆరోగ్య సంరక్షణ చర్యలను పరిశీలించారు. పర్ణశాల సబ్-స్టేషన్, తూరుబాకల వద్ద ఆర్అండ్‌బీ ప్రధానర హదారిపై మంగళవారం సాయంత్రానికి వరదనీరు తగ్గడంతో రాకపోకలు కొనసాగాయి. సున్నంబట్టి వద్ద ఐదోరోజు సైతం రాకపోకలకు అంతరాయం కొనసాగుతోంది. వైద్యాధికారులు పుల్లారెడ్డి, రేణుకారెడ్డి, నాగరాజు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి

బూర్గంపాడు జూలై 23: మండలంలో మంగళవారం గోదావరి వరద తగ్గుముఖం పట్టింది, గతరెండు రోజులుగా గోదావరి వరదలతో మండలంలోని సారపాక-నాగినేనిప్రోలురెడ్డిపాలెం,కిన్నెరసాని పోటెత్తడంతో బూర్గంపాడు-సోంపెల్లి మార్గంలో ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరటంతో రాకపోకలు నిలిచిపోయాయి.బూర్గంపాడు గ్రామంలో పత్తిచేలు నీటమునిగాయి.బూర్గంపాడు,సారపాక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. మండలంలో వరద పరిస్థితిని భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు పర్యవేక్షించారు.





నాటుపడవపై ప్రయాణిస్తున్న హెల్త్ అడిషనల్ డైరక్టర్, వరద పరిస్థితి పరిశీలిస్తున్న ఆర్డీవో

తాలిపేరుకు తగ్గిన వరద

చర్ల: చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. మూడు రోజులుగా చర్ల, చత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో వరదనీరు పోటెత్తింది. అధికారులు పరిస్థితిని అంచనా వేస్తూ నీటిని విడుదల చేశారు. కాగా మూడు రోజుల క్రితం 1లక్ష48వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుంచి అత్యధికంగా విడులైంది. నేడు వర్షాలు తగ్గడంతో వరద తీవ్రత తగింది. మంగళవారం ప్రాజెక్టు 25 గేట్లను ఎత్తిన అధికారులు 19 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఇన్‌ఫ్లో 18 వేల క్యూసెక్కులు కాగా, నీటి మట్టం 71 మీటర్లుగా ఉంది.

బూర్గంపాడును ముంపునుంచి కాపాడాలి

బూర్గంపాడు: బూర్గంపాడు మండలాన్నిగోదావరి వరద ముంపు నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ముజాహిద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటిసి కామిరెడ్డి శ్రీలత, అఖిలపక్షనాయకులు బూసిరెడ్డి శంకర్‌రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, జలగంజగదీష్,కేవి రమణ,బిజ్జం శ్రీనివాసరెడ్డి,దామర శ్రీనివాస్,బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వరదప్రవాహంలో సీతమ్మ సాగర్

అశ్వాపురం: గోదావరి 50అడుగులు దాటి ప్రవహిస్తుండటంతో మండలంలో మంగళవారం పలు ప్రాంతాల్లో వరద పోటెత్తింది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు స్వల్పంగా స్థంభించాయి. గోదావరి పోటెత్తడంతో అమ్మగారిపల్లి-అమెర్ధా, చింతిర్యాల-ఆనందాపురం, నెల్లిపాక-రామచంద్రాపురం గ్రామాల మధ్య ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరటంతో రాకపోకలు బంద్ అయ్యాయి. రామచంద్రాపురం వద్ద భద్రాచలం వెళ్లే రహదారిపై గోదావరి వరద చేరటంతో అధికారులు ఆమార్గంలో రాకపోకలను నిలిపి వేశారు. మొండికుంట వద్ద ప్రధాన రహదారిపై పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేసి పహరా ఉంచారు.



సీతమ్మ సాగర్

● మండల పరిధిలోని కుమ్మరిగూడెం వద్ద నిర్మిస్తున్న సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం వరద ప్రవాహంలో మునిగి పోయింది. ఇప్పటికే పనులు నిలిపి వేయటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ముంపు ప్రాంతాల్లో ఎంపీపీ పర్యటన

అశ్వాపురం: మండలంలోని గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో మంగళవారం ఎంపీపీ ముత్తినేని సుజాత పర్యటించి వరద పరిస్థితిని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలైన అమ్మగారిపల్లి, అమెర్ధా, నెల్లిపాక గ్రామాల్లో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఖదీర్,మొండికుంట,నెల్లిపాక ఎంపీటీసీలు కమటం నరేష్,గాదెజయ, నాయకులు మురళీ, నరేష్ పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి: ఏవో

సుజాతనగర్, జూలై 23: రైతు బీమా పథకం చాలా విలువైనదని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో జి.నర్మద అన్నారు. మంగళవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె రైతు బీమా పథకం వివరాలు వెల్లడించారు. రైతు బీమా పథకానికి అర్హత ఉన్న రైతులు (18 నుండి 59 సంవత్సరాలు) ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సుజాతనగర్ క్లస్టర్ ఏఈవో ఆర్. శరత్, సెల్ నెం. 8185950935, సీతంపేట క్లస్టర్ ఎస్. ప్రనూష, సెల్ నెం. 9182883295, సింగభూపాలెం క్లస్టర్ ఏఈఓ బి. నర్సింహారావు సెల్ నెం. 8985654898 లో సంప్రదించి బీమా చేయించుకోవాలని తెలిపారు.

పెదవాగు ప్రాజెక్టు గండి బీఆర్ఎస్ తప్పిదమే: సీపీఐ

భద్రాచలం, జూలై 23: పదేళ్లపాటు పాలన సాగించిన పాలకులు పచ్చి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేశారని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా అన్నారు. భద్రాచలంలో గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన ఆయన పర్యటించారు. పలువురు ప్రజలు వచ్చి సమస్యలను ఆయనకు వివరించారు. వరదలు, వర్షాలు వచ్చి ఈ ప్రాంతం బురదమయంగా ఉందని భయాందోళనకు గురవుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు భద్రాచలంలో మెరక ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేకపోయారన్నారు. బూర్గంపాడు, అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయని నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటం బీఆర్ఎస్ ప్రభుత్వం దానిని సరైన పద్ధతిలో నిర్వహణ చేయకపోవడమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, ముత్యాల విశ్వనాథం, మారెడ్డి శివాజీ, చిట్టిపోతుల కృష్ణయ్య పాల్గొన్నారు.

బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

బూర్గంపాడు: గోదావరి వరద బాధిత రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన ముంపుకు గురయిన పంటపొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల విశ్వనాధం, మండల కార్యదర్శి ముప్పా వెంకటేశ్వరరావు,నాయకులు సీతారామరెడ్డి, సుబ్బారెడ్డి,సత్యనారాయణ,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ 70వ ఆవిర్భావ దినోత్సవం

ఇల్లెందు టౌన్,జూలై 23: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 70 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఇల్లెందు పట్టణంలోనిర్వహించారు. బ్రాంచి కార్యాలయంలో జెండా విష్కరణచేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఎంఎస్ ఇల్లెందు ఏరియా ఉపాధ్యక్షులు నాయిని సైదులు మాట్లాడుతూ బీఎంఎస్ యూనియన్ దేశ వ్యాప్తంగా కార్మికుల హక్కుల సాధనకోసం ముందుండి పని చేస్తుందని వెల్లడించారు. సింగరేణిలో సైతం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తీవ్రంగా కృషి చేస్తుందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ బి. లీలా కృష్ణ, సెంట్రల్ కార్యదర్శి ఆరుట్ల మాధవరెడ్డి, జాయింట్ సెక్రటరీ వై. నాగేశ్వరరావు, ఆర్గనైజర్ సెక్రటరీ జి. రాజశేఖర్, కోశాధికారి శశికుమార్, నాయకులు రాంబాబు, రాము, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపల్లె, వార్డులో రక్త పరీక్షలు నిర్వహించాలి: బీజేపీ

పాల్వంచ టౌన్, జూలై 23 : ప్రతి పల్లె, ప్రతి వార్డులో రక్తపరీక్షలు జరిపించి వైద్యసేవలు అందించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపధ్యంలో జ్వరాలు, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని, పల్లె దవాఖానాలు పట్టణ దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగూడెం బీజేపీ పట్టణ అధ్యక్షులు గొడుగు శ్రీధర్, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు గాంధీనాయక్, విజయ్, ఖమూరుద్దీన్ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యాలయంలో పరిష్కార విభాగం (సెల్) ఏర్పాటు

కొత్తగూడెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న రుణమాఫీ పథకంలో రైతులకు సమస్యలు, ఫిర్యాదు పరిష్కారానికి జిల్లా వ్యవసాయ కార్యాలయంలో పరిష్కార విభాగం (సెల్) ఏర్పాటు చేశామని జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రైతులంతులు తమ సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ విస్తరణ అధికారిని, మండల వ్యవసాయ సహాయ, సంచాలకులను నేరుగా సంప్రదించాలని కోరారు. మండల, క్లస్టర్ స్థాయిలో వివరాలు అందని వారు జిల్లా స్థాయి పరిష్కార విభాగం సెల్ నెం: 9288894249ను సంప్రదించాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జూలూరుపాడు, జూలై 23: వర్షాకాలంలో సంబవించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో తులసీరాం సూచించారు. మంగళవారం మండలంలోని పలు పంచాయతీలలో కార్మికులు చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లలో మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికులపై చర్యలు సరికాదు

మణుగూరుటౌన్, జూలై 23: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో యాజమాన్యం కార్మికులపై వేదింపు చర్యలకు పాల్పడడం సరికాదని టీబీజీకేఎస్ నాయకులు నాగెల్లి వెంకట్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏరియాలోని కేసీయూజీ గనిలో ప్లేడేలు, పీహెచ్‌డీల కేటాయింపుల్లో అక్రమాలు చోటు చేసుకుంటన్నాయని ఆరోపిస్తూ సదరు అక్రమాలను మీడియాకు సైతం చెబుతున్నారన్న నేపంతో కార్మికులపై కక్ష్య కట్టి చార్జ్‌షీటులు ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో పాటు చార్జ్‌షీట్ ఇచ్చిన అధికారులు సదరు కార్మికులను విచారణ వేదింపుతో మానసికంగా వేదిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో కార్మికునితోపాటు కార్మికుల కుటుంబ సభ్యులకు ఏమైన నష్టం వాటిల్లితే యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు.

పిల్లలను బడికి పంపితేనే భవిష్యత్

గుండాల, జూలై 23: పిల్లలను పనిలో కాకుండా ప్రతీ రోజు బడికి పంపితేనే భవిష్యత్ బాగుంటుందని ఎంఈవో క్రిష్ణయ్య, వాసవీ క్లబ్ గ్రీన్‌ఫీల్డ్ మండల అధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లు, సీపీ సీడ్స్ చీఫ్ అపరేటింగ్ అధికారి పియాపోర్న్ నిన్‌లయగనన్ అన్నారు. మంగళవారం మండలంలోని పోతిరెడ్డిగూడెం, జగ్గాయిగూడెం ప్రాథమిక పాఠశాలలకు బల్లాలు, వాటర్ ఫిల్టర్లు వితరణ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చదువుకున్నప్పుడే అభివృద్ధి చెందుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వాగబోయిన రామక్క, సీపీ సీడ్స్ తెలంగాణ ఇంచార్జీ రాజశేఖర్ .పుల్లఖండం ఉపెందర్, అనుమోల వెంకటేశ్వర్లు, మానాల ప్రణీత్, పొంబోయిన ముత్తయ్య, పూకె బాబు, సుధాకర్, కౌసల్య, జిమ్మిడి సాంబయ్య పాల్గొన్నారు..

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాలి

చుంచుపల్లి, జూలై 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు స్పందించాలని మాదిగ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు ఆరోపించారు. మంగళవారం చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల కోసం వేచి ఉన్న వృద్ధురాలను మద్దతుగా నిలిచారు. రాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశాలను బేఖాతరు చేస్తున్న చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 200 యూనిట్ల కంటే తక్కువ వచ్చిన కరెంట్ బిల్లును చెల్లించవలసిన అవసరం లేదని, అలా తక్కువ యూనిట్ వచ్చిన వాళ్ళు మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం కల్పిస్తున్న గృహజ్యోతి పథకాన్ని పొందాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు.

సుద్దరేవు చెరువుకు గండి

ఆళ్లపల్లి, జులై 23: ఆళ్లపల్లి మండలం, మర్కోడు పంచాయతీలోని సుద్దరేవు చెరువుకు గండి పడటంతో ఇరిగేషన్ అధికారుల అప్రమత్తమైనారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుద్దరేవు చెరువు నిండు కుండలా నిండుకుంది. కాగా తూము దగ్గరపై భాగం నుండి నీరు బయటకు కారడంతో సుద్దరేవు రైతులు గుర్తించి ఇరిగేషన్ ఏఈ దుర్గప్రసాద్‌కు తెలిపారు. దాంతో స్పందించిన ఇరిగేషన్ ఏఈ దగ్గర ఉండి ట్రాక్టర్ల సహాయంతో గండిపడిన చోట మట్టి పోసి మరమ్మతులు పూర్తి చేయించారు. ఆయా పనులను డీఈ నాగమల్లేశ్వరావు పరిశీలించారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి: సీఐ

జూలూరుపాడు, జూలై 23 : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని జూలూరుపాడుసీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. పోలీస్‌శాఖ వారి ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడులోని రాష్ట్రీయ రహదారిపై బారికేడ్లను ఏర్పాటుచేశారు. రహదారికి ఇరువైపులా సైడ్ డ్రైన్లపై ఏర్పాటుచేసిన రేకుల షెడ్లు, బోర్డులను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రాణా ప్రతాప్, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యం పేరుతో కార్పొరేట్ల అవసరాలు తీర్చే కుట్ర

చుంచుపల్లి, జూలై 23: నైపుణ్యం పేరుతో కార్పొరేటర్లకు అవసరాలు తీర్చే కుట్ర జరుగుతుందని భద్రాద్రి జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం విమర్శించారు. మంగళవారం కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లా వ్యాప్త నిరసనలకు పిలుపునిస్తున్నట్లు చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరసన తెలియజేశారు. మాట్లాడుతూ యువతకు ఉపాధి, నైపుణ్యానికి పెద్ద పీట పేరుతో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అవసరాలను తీర్చే మానవ వనరులను తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. బడ్జెట్ పూర్తిగా విద్యార్థులు, యువత భవిష్యత్తును కార్పొరేట్లకు తాకట్టు పెట్టే విధంగా ఉందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జూనియర్ కళాశాల నాయకులు ప్రవీణ్, సాయి, రవి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు పాస్ పుస్తకాల పంపిణీ

ఇల్లెందు టౌన్, జూలై 23: సింగరేణి ఇల్లెందు ఏరియాలోపని చేస్తున్న ఒప్పంద కార్మికులకు సీఎంపీఎఫ్ ఖాతా పుస్తకాలను మంగళవారం ఏరియా జీఎం జాన్ ఆనంద్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఒప్పంద కార్మికులు సీఎంపీఎఫ్ కట్టింగ్ అయ్యేవిధంగా చూసుకోవాలని కోరారు. దాని వల్ల పలు ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. ఒప్పంద కార్మికులు, హెచ్‌డీఎఫ్‌సీ, స్టేట్‌బ్యాంక్ అందిస్తున్న బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీరు నర్సింహరాజు, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, పర్యావరణ అధికారి ధనుంజయరెడ్డి, ఫైనాన్స్ మేనేజరు మధుబాబు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను ఓడించడమే

అమరులకు నిజమైన నివాళి

అమరవీరుల సంస్మరణ జయప్రదం చేయండి ● మావోయిస్టు నేత అరుణ పేరిట లేఖ

చర్ల, జూలై 23: ఆపరేషన్ కగార్ దాడుల మధ్యనే జూలై 28నుంచి ఆగస్టు 3వరకు అమరవీరుల వారోత్సవాలు నిర్వహించాలని, ఆపరేషన్ గార్‌ను ఓడించడమే అమరులకు నిజమైన నివాళి అని మావోయిస్టు పార్టీ చర్ల, శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పిలుపునిచ్చారు. అరుణ పేరుతో మావోయిస్టు పార్టీ మంగళవారం లేఖను విడుదల చేసింది. ప్రజాయుద్ధంలో ప్రజల కోసం ప్రాణాలివ్వడం హిమాలయాల కన్నా గొప్పదన్నారు. ఈ ఏడాది 200మంది కామ్రేడ్లు తమ ప్రాణాలు అర్పించారన్నారు. ప్రజలు నీళ్ల, నిధులు, నియామకాల కోసం ఎన్‌కౌంటర్లు లేని ప్రజాస్వామిక తెలంగాణ కోసం దశాబ్ధకాలం పాటు పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో నేడు ప్రజాస్వామిక హక్కులు కురువయ్యాయని ఆరోపించారు. తెలంగాణ ప్రజలను నయవంచన చేసిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్యం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఆరు నెలలు తిరగకముందే ప్రజాసమస్యలపై అవినీతి అక్రమాలపై పోరాడుతున్న వారిపై దాడులు చేయిస్తోందని అరుణ ఆరోపించారు. సభలు సమావేశాలు నిర్వహించకుండా నిషేదాంక్షలు విధిస్తున్నాని, మావోయిస్టు పార్టీని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వంతో చేతులు కలిపి ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మావోయిస్టులకు సహకరిస్తున్నారని అమాయక ప్రజలపై అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ఆపరేషన్ కగార్‌ని ఓడించడమే అమరులకు నిజమైన నివాళి అని అరుణ తన లేఖలో పేర్కొన్నారు.

దుమ్ముగూడెం తహసీల్దార్ బదిలీ

దుమ్ముగూడెం జూలై 23: దుమ్ముగూడెం తహసీల్దార్ పీ చంద్రశేఖర్‌ను స్పౌజ్ కేటగిరీలో సిద్దిపేట జిల్లాకు బదిలీ చేస్తూ కలెక్టర్ జితేష్ వీ పాటిల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా భద్రాచలం డీటీ మణిదర్‌కు ఇస్తారని సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కరీంనగర్ జిల్లా నుంచి దుమ్ముగూడేనికి బదిలీపై వచ్చారు.

గ్రామాలను పరిశీలించిన ఎంపీడీవో

మణుగూరు, జూలై 23: మణుగూరు మండలంలోని రూరల్ గ్రామాలను మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది పరిశీలించారు మండలంలోని దమ్మక్క పేట, సాంబాయిగూడెం, చుక్కుడుగుంట గ్రామాల్లో పర్యటించి ప్రజల ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. పారిశుధ్య పనులపై తీసుకోవాల్సిన చర్యలు సమీక్షించారు. అలాగే గ్రామాల్లో జ్వరాల బారిన పడకుండా నిల్వనీటిని పారబోస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల అధికారులతో పాటు స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరద ముంపు అప్రమత్తతపై సమీక్ష

పినపాక, జులై 23: మండలంలోని గోదావరి, పెద్దవాగు ముంపు ప్రాంతాలతో పాటు, భారీ వర్షాలకు లోతట్టు, ముంపు ప్రాంతాల్లో చేపట్టవలసిన చర్యలు అప్రమత్తతపై మంగళవారం పినపాక తహసీల్దార్ సూర్యనారాయణ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశానికి మండల పరిధిలోని పలు శాఖలాధికారులు పాల్గొన్నారు. వరద ముంపు, లోతట్టు ప్రాంతాలలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలింపు, పునరావాస కేంద్రాలలో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాల కల్పన, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు, శానిటేషన్ పనులపై తహశీల్దార్ సమీక్షించారు. కార్యదర్శులకు సదుపాయాల కల్పనకు సంబంధిత శాఖలధికారులు చేపట్టవలసిన చర్యలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ డిఈ సైదుల్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ కావ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కృష్ణ, ఎంఈఓ వీరాస్వామి, ప్రభుత్వ వైద్యాధికారులు దుర్గాభవాని, శృతి, సెక్రటరీలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భద్రాచలం, జూలై 23: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ సమీపంలో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు పట్టణ ఎస్ఐ పీవీఎన్‌రావు తెలిపారు. మృతిచెందిన వృద్ధుడి వయస్సు 60-65 ఏళ్ల మధ్య ఉంటుం దని తెలిపారు. చామనచాయ రంగుతో, తెలుపురం గు జుట్టు, గడ్డం కలిగి ఉన్నారన్నారు. వివరాలు తెలిసిన వారు 8712682106ని సంప్రదించాలని తెలిపారు.

28 న రాయల సంతాప సభ

జూలూరుపాడు, జూలై 23: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ రాయల చంద్రశేఖర్ సంతాప సభ ఈ నెల 28న పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావు, బాణోత్ దర్మాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాయల సిద్ధు, ఎం. కృష్ణయ్య, వీరు పాల్గొన్నారు.

రుణమాఫీ సందేహాలకు ఏఈవోలను సంప్రదించండి

దమ్మపేట, జూలై 21: రుణమాఫీ సందేహాలు వుంటే ఆయా గ్రామాల పరిదిలోని ఏఈవోలు సంప్రదించాల్సిందిగా ఏవో చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ సర్వసభ్యసమావేశం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సోయం ప్రసాదు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈసందర్భంగా రుణమాఫీ, వ్యవసాయయాంత్రీకరణ పనుముట్లపై పలువురు ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతు అర్హులైన రైతులకు రుణమాఫీ జాబితాలో పేర్లు లేవని సభ్యులు పలు సందేహాలను వెలబుచ్చారు. రాయతీపై వ్యవసాయ పనిముట్లు వస్తున్నాయా అని ప్రశ్నించారు. ఈఅంశంపై ఏవో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతు రుణమాఫీపై ఏమైన సందేహాలు వుంటే స్థానిక ఏఈవో లను ఆదార్‌కార్డుతో సంప్రదించినట్లయితే సమాచారం తెలుస్తుందని తెలిపారు. ఎంపీపీ సోయం ప్రసాదు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు మాట్లాడుతు మండలపరిషత్‌ల అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు రానప్పటికి స్థానిక ఎమ్మెల్యే, మంత్రుల సహాకారంతో సమస్యలు పరిష్కరించేందుకు తమ పదవీకాలంలో కృషి చేసామని పాలకవర్గానికి సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసమావేశంలో జడ్పీటీసి పైడి వెంకటేశ్వరరావు, వైస్‌ఎంపీపి దారా మల్లికార్జునరావు, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీవో రమారావు, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవారావు, వివిదశాఖాల అధికారులు పాల్గొన్నారు.

మండలపరిషత్ పాలకవర్గ సభ్యులకు సత్కారం

కొద్దిరోజులలో మండలపరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగియనుండటంతో జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాదు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ఎంపీటీసీ సభ్యులను, బదిలిపై వెళుతున్న మండలపరిషత్ సిబ్బంది శ్రీనివాసరావు, దాస్‌లను అధికారులు, పాత్రికేయులు, పలు పార్టీల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎల్లిన రాఘవరావు, మురళీ, దొడ్డా ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, రావు గంగాధరరావు, ఎర్రా వసంతరావు, కాసాని నాగప్రసాదు, చిన్నంశెట్టి యుగంధర్, మన్నెం అప్పారావు, ఎర్రగొర్ల రాధాకృష్ణ, గోపీశాస్త్రి, తదితరులు వున్నారు.



మాట్లాడుతున్న ఏవో చంద్రశేఖర్‌రెడ్డి

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలను పెంచాలి

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ పాటిల్ » కొత్తగూడెంలో మాతాశిశు కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

కొత్తగూడెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలను పెంచాలని కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓపీ బ్లాక్, పోస్ట్ ఆపరేటివ్ వార్డు, చిన్న పిల్లల ఓపీ, ఆరోగ్యమిత్ర, మందులు ఇచ్చే గది, పోస్ట్ నెల్‌వార్డు, రెసెప్షన్‌లను పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్న రికార్డులను పరిశీలించి ప్రతిరోగి వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సకాలంలో విధులకు హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్యకేంద్రంలో కావాల్సిన సదుపా యాలు, చేపట్టాల్సిన పనులకు సంబంధించి నివేదికలు సమర్పిం చాలని అధికారులను కోరారు. ఆరోగ్య మహిళ మిత్ర సేవాకేంద్రం తీరుతెన్నులను ఆరాతీశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డాక్టర్ సరళ, డాక్టర్ వీరబాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్, రికార్డులు పరిశీలిస్తున్న జితేష్ పాటిల్